కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
సోమవారం 08, జూన్ 2026 16 పేజీలు

నయా హిట్లర్ సిఎం రేవంత్‌రెడ్డికి పతనం తప్పదు

కాంగ్రెస్ దగా కోరు పాలనపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

2వ పేజీలో...











ముగిసిన పోలీసు కస్టడీచోరీ సొత్తుపై వీడని సందిగ్ధ

2వ పేజీలో...

ఆయుధాలు సెల్ఫోన్ స్వాధీనం మరో నిందితుని అరెస్టు చేశాం సిపి గౌస్ ఆలం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

నగరంలో సంచలనం సృష్టించిన పిఎంజె నగల దుకాణం దోపిడీ కేసు దర్యాప్తులో అదుపులోకి తీసుకున్న నిందితుల పోలీస్ కస్టడీ ఆదివారం ఉదయం తో ముగిసింది. నాలుగు రోజుల విచారణ అనంతరం నిందితులను తిరిగి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. నిందితుల విచారణ అనంతరం విచారణలో రాబట్టిన సమాచారం ఆధారంగా వెలిచాల బైపాస్ రోడ్ లో దోపిడీకి వినియోగించిన రెండు ఆయుధాలను ధర్మపురి బుగ్గారం మధ్య అడవి ప్రాంతంలో ఒక సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు సిపి గౌస్ ఆలం పేర్కొన్నారు. అలాగే బీహార్‌లో మరో కీలక నిందితుడిని అరెస్ట్ చేశామని ఈ కేసులో పదవ నిందితుడిగా ఉన్న అమర్ సింగ్ ను కోర్టు అనుమతితో కరీంనగర్కు తీసుకు వస్తున్నట్లు సిపి తెలిపారు. నిందితులను విడివిడిగా కలిపి విచారించిన విభిన్నమైన వాంగ్మూలాలు









నయా హిట్లర్ సిఎం రేవంత్ రెడ్డికి పతనం తప్పదు

కాంగ్రెస్ దగా కోరు పాలనపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

నయా హిట్లర్ రేవంత్ రెడ్డికి పతనం తప్పదని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ దగా కోరు పాలనపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఆదివారం పెద్దపల్లిలో జరిగిన సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2034 దాకా నేనే అధికారంలో ఉంటా అని అహంకారంతో మాట్లాడుతున్నాడని, రేవంత్ రెడ్డి తల కిందకు పెట్టి కాళ్ల మీదకు పెట్టి ఎన్ని కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో 100 సీట్లతో బి ఆర్ ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలన నడుస్తోందని, ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ దాకా ఎవరిని కదిలించినా ఒక్కటే మాట వినిపిస్తోందని, కాంగ్రెస్ పోవాలి... కెసిఆర్ మళ్లీ రావాలి అని జనం క్లియర్ గా డిసైడ్ అయ్యారని చెప్పారు. కేవలం రెండున్నరేళ్ల రేవంత్ రెడ్డి దరిద్రపు పాలన చూసిన జనం ముక్కున వేలేసుకుంటున్నారని, అప్పట్లో బి ఆర్ ఎస్సే వంద రెట్లు బాగుండేదని చర్చించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందని, పైగా గతంలో కె సి ఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగించిన ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని పూర్తిగా ఆపేసిందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రంలోని 30 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బిసి పేద పిల్లల చదువులను, వారి ఉజ్వల భవిష్యత్ ను ఈ ప్రభుత్వం ఘోరంగా ఆగం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులతో పాటు రైతులను కూడా ఈ ప్రభుత్వం నమ్మించి గొంతు కోసిందని, రైతు బంధు, రైతు బీమా పథకాలను పూర్తిగా ఆపేసిందని ఆరోపించారు. ఎరువుల సరఫరా చేయడంలో ప్రభుత్వం దారుణంగా ఫెయిల్ అయిందని, వడ్లు, మక్కలు కొనకుండా రేవంత్ రెడ్డి అన్నదాతలకు కళ్లల్లో చుక్కలు చూపించాడని, ఇంతటి ద్రోహం చేసిన రేవంత్ రెడ్డికి రైతు అనేవాడు జీవితంలో ఓటు వేయడని దుయ్యబట్టారు. వడ్లు అమ్ముకోవడానికి రైతులకు ఏకంగా 45 రోజులు పట్టిందని, కల్లాల్లో పడిగాపులు కాస్తూ అన్నదాతలు నానా అవస్థలు పడ్డారని, ఇవాల్టికి కూడా 20 నుంచి 30 శాతం వడ్లు ఇంకా కల్లాల్లోనేఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం కెసిఆర్ ఎన్నడూ తప్పుడు మాటలు చెప్పలేదని, ఓట్లు వేస్తేనే రైతు బంధు ఇస్తానని అనలేదని, కేవలం రైతు మీద ఉన్న అపారమైన ప్రేమతోనే రైతు బంధు తెచ్చాడని గుర్తు చేశారు. గతంలో భయంకరమైన కరోనా కష్టకాలం వచ్చినప్పుడు కూడా కెసిఆర్ మానవత్వంతో ఆలోచించి ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు బంద్ చేశాడని, కాంట్రాక్టర్ల బిల్లులు ఆపాడే తప్ప రైతన్నలకు మాత్రం రైతు బంధు ఆపకుండా వేశాడని చెప్పారు. అలా 11 విడతల్లో ఏకంగా 73 వేల కోట్ల రూపాయల రైతు బంధు ఇచ్చిన ఘనత కెసిఆర్ దేనన్నారు. కానీ రేవంత్ రెడ్డికి ఏమైందని, ఒకసారి ఏగనామం పెట్టాడని, ఒకసారి మూడు ఎకరాలకు, ఇప్పుడు రెండు ఎకరాలకు ఇస్తూ రైతులను భిక్షగాళ్లలా చూస్తున్నాడని మండిపడ్డారు. కెసిఆర్ సభ పెడితే భయపడి ఒకసారి ఇచ్చాడని, ఒకసారి సిద్ధిపేట వస్తానంటే రైతు బంధు ఇవ్వకుండా సిద్ధిపేటలో కాళ్ల ఎలా పెడతావని తాను నిలదీస్తే అప్పుడు రైతు బంధు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. సిద్ధిపేటలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 45 రోజుల్లో మొత్తం డబ్బులు ఇస్తామన్నాడని, ఇప్పటికి 70 రోజులు దాటినా రైతు బంధు పడలేదని, ఈ యాసంగి పంటకు రైతులకు పూర్తిగా ఎగనామం పెట్టాడని నిప్పులు చెరిగారు. రుణమాఫీ మొదటి సంతకం పెడతానని చెప్పి, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కరీంనగర్‌లో వేములవాడ రాజన్న మీద, మెదక్‌లో అమ్మవారి మీద, నల్గొండలో యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి మీద, ఖమ్మంలో భద్రాచలం రాములవారి మీద ఒట్లు పెట్టి మోసం చేశాడని ధ్వజమెత్తారు. పోయిన కాడల్లా దేవుళ్ల మీద ఒట్లు పెట్టి పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పాడని, 2 లక్షల లోపు ఉన్న వాళ్లకు కాలేదు, 2 లక్షల పైన ఉన్న వాళ్లకు కాలేదని, బడ్జెట్ స్పీచ్ లో కూడా ఒప్పుకున్నట్లు సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా దగా చేశాడన్నారు. రైతు బంధును మూడు దఫాలు ఎగగొట్టాడని, గత కాంగ్రెస్ హయాంలో పోలీస్ స్టేషన్లలో ఎరువులు పెట్టి అమ్మారని, గత బిఆరఎస్ హయాంలో అప్పటి సిఎం కెసిఆర్ ప్రతి మండలానికి ఎరువుల గోదాంలు కడితే, మళ్లీ కాంగ్రెస్ వచ్చాక పాత రోజులు వచ్చి ఎరువుల బస్తాల కోసం రైతులు గంటల కొద్దీ లైన్లలో నిలబడాల్సి వస్తోందని, వారిపై పోలీసు లాఠీఛార్జీలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో కెసిఆర్ చెప్పినట్లే కాంగ్రెస్ వచ్చాక రైతు బీమాకు రాం రాం అన్నారని, దళిత బంధుకు జై భీం అన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 3000 మంది రైతులు చనిపోయినా రైతు బీమా రాలేదని, అదే కెసిఆర్ హయాంలో అయితే వారం రోజుల్లోనే కుటుంబానికి ఐదు లక్షల భీమా జమా చేశామని గుర్తు చేశారు. ఇప్పుడు దొంగచాటుగా జీవో నెంబర్ 8 తెచ్చి రైతు డిస్కాం అమలు చేయాలని చూస్తున్నాడని, దీనివల్ల రైతులకు కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే కరెంట్ అందుతుందని, నాడు కెసిఆర్ ఇచ్చిన 24 గంటల ఉచిత కరెంట్ ను ఊడబీకి రైతు డిస్కాం పేరిట రేవంత్ రెడ్డి రైతులకు ఉరితాడు వేయబోతున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తాను రైతు బిడ్డనని డబ్బా కొట్టుకుంటాడని, రైతులకు ఇంతటి ఘోరమైన అన్యాయం చేసిన నువ్వు అసలు రైతు బిడ్డవు ఎలా అవుతావని ప్రశ్నించారు. నాడు ప్రపంచాన్ని వీడించిన హిట్లర్ కు ఏ గతి పట్టిందో, ఈ నయా హిట్లర్ రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమి తరిమి కొట్టే రోజులు అత్యంత దగ్గరలోనే ఉన్నాయని బిఆరఎస్ నాయకుడు హరీష్ రావు అత్యంత ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్, చిరుమిళ్ల రాకేష్, ఈద శంకర్ రెడ్డి, రఘువీర్‌సింగ్, సత్యనారాయణ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఉప్పు రాజు కుమార్, గంట రాములు తదితరులున్నారు.

ముగిసిన పోలీసు కస్టడీచోరీ సొత్తుపై వీడని సందిగ్ధ

మొదటి పేజీ తరువాయి..

ఇచ్చారని చోరీ చేసిన సొత్తు విషయంలో స్పష్టత లేదని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్ దోపిడీకి సంబంధించి ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలు పరస్పర విరుద్ధంగా ఉండడంతో ఎలాంటి స్పష్టత రాలేదని మరో మారు కస్టడీ కోరుతామని సిపి తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసు బృందం దర్యాప్తు కొనసాగిస్తుందని దానిలో భాగంగానే అమర్ సింగ్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అమర్ సింగ్ ను అక్కడి స్థానిక కోర్టులో హాజరు పరిచి కరీంనగర్కు తీసుకువచ్చేందుకు ట్రాన్సిట్ వారంట్ పొందినట్లు స్పష్టం చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు కొనసాగిస్తూనే ఉన్నాయని తెలిపారు. అన్ని చిక్కుముడులే....?పి ఎం జె నగల దుకాణం దోపిడీ కేసులో ఇప్పటివరకు పోలీసులు సాధించిన పురోగతిలోనూ చిక్కుముడి వీడటం లేదని తెలుస్తుంది. కస్టడీ విచారణలో నిందితులు తెలిపిన సమాచారం మేరకు ఆయుధాలను సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న పోలీసులు వారిని వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్టు చేసినట్లు చూపినప్పుడు ఆయుధాల గురించి ఎందుకు శోధించలేదు మిస్టరీగా ఉంది. మహారాష్ట్ర వైపు పారిపోయే క్రమంలో రోడ్డుపై పడేసిన సెల్ఫోన్ పగిలిపోయి ఉందని దానికి డాటా శోధించడం ద్వారా నిందితుల ఆచూకీ దొరికిందని చెప్పిన పోలీసులు మరో సెల్ఫోన్ విషయం ఎందుకు కనిపెట్టలేదు తెలియకుండా ఉంది. పగిలిపోయిన సెల్ఫోన్ డేటా శోధించడం ద్వారా గోల్డెన్ థీఫ్ సుబోధ్ సింగ్ పనేనని గుర్తించిన పోలీసులకు వెలిచాల ఎక్స్ రోడ్లో దాచిపెట్టిన ఆయుధాలు అటవీ ప్రాంతంలో పడేసిన మరో సెల్ఫోన్ విషయం తెలవకపోవడం విడ్డూరంగా కనిపించక మానదు. ఇదిలా ఉంటే ఆయుధాలను ఇక్కడే దాచి పెట్టడం వెనక ఈ గ్యాంగ్ మరో దోపిడీకి ఇక్కడే స్కెచ్ వేసిందా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. దీనిపై పోలీసులు స్పష్టత ఇవ్వకపోవడం కూడా ఆ అనుమానాలకు బలం చేకూరుస్తుంది.సుబోధ్ చుట్టూ ఉచ్చు బిగించడమేనా....?దోపిడీ ఘటన జరిగినప్పటి నుంచి సుబోధ్ సింగ్ ముఠా పనేనని చెప్పుకొచ్చిన పోలీసులు ఆ దిశలోనే దర్యాప్తు కొనసాగించడం వెనక అనుమానాలు ఉన్నాయి. దోపిడీకి పాల్పడిన నిందితులు ఐదుగురేనని గుర్తించిన పోలీసులు వారిని పట్టుకోవడంలో మాత్రం సక్సెస్ కాలేకపోయారు. జైల్లో ఉండి దోపిడీలు చేస్తూ నెట్వర్క్ నడిపిస్తున్న సుబోధ్ కరీంనగర్ పోలీస్ కస్టడీ విచారణలో మాత్రం జైలులో ఫోన్ వినియోగించినట్లు బయటపడిందని చెప్పడం పోలీసుల పనితీరును విమర్శల పాలు చేస్తుంది. దేశమంతట నెట్వర్క్ నడుపుతున్న గోల్డెన్ థీఫ్ జైల్లో సెల్ఫోన్ వినియోగించినట్లు తెలుసుకొని కొత్తగా ఏం సాధిస్తారు అన్నది స్పష్టత లేదు. తాజాగా మరో నిందితుడు అమర్ సింగ్ ను అదుపులోకి తీసుకొని కరీంనగర్కు తీసుకు వస్తున్నట్లు ప్రకటించడం కూడా గోల్డెన్ థీఫ్ గ్యాంగ్ కు ఉ చ్చు బిగించడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. పోలీసులు అదుపులోకి తీసుకున్న అమర్ సింగ్ గ్యాంగ్ లీడర్ సుబోధ్ సింగ్ సోదరుడైన లేక మరో వ్యక్తి అన్నది పోలీసులు స్పష్టం చేయలేదు. ఒకవేళ సుబోధ్ సింగ్ సోదరుడే అయితే దేశవ్యాప్తంగా దోపిడీకి పాల్పడిన సొమ్ము అంతా అతని చేతిలోనే ఉంటుందని బీహార్ పోలీసుల అనుమానాలు అని ఇప్పటివరకు చెప్పిన పోలీసులు అమర్ సింగ్ అరెస్టుతో పెద్ద ఎత్తున రికవరీ జరుగుతుందా అనేది తేలాల్సి ఉంది.

కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే సింగరేణికి నష్టాలు

సింగరేణిని నిండా ముంచుతున్న ఏ ఐ టి యు సి, ఐ ఎన్ టి యు సి సంఘాలు

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను చెల్లించాలి

జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి

భూపాలపల్లి, జూన్ 07, ప్రభాతవార్త

తెలంగాణలో అతిపెద్ద భారీ పరిశ్రమ అయిన సింగరేణి సంస్థను పాలక ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల మూలంగా అధోగతి పాలు చేస్తున్నారని బిఎమ్ఎస్ జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్త కాపు లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా లాభాలను సాధిస్తున్న సింగరేణి సంస్థ లో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లనే నష్టాలు వస్తున్నాయని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం 29వ ద్వి వార్షిక మహాసభ పట్టణంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు తెలంగాణ రాష్ట్రంలోని 12 డివిజనల్ చెందిన సుమారు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఇతర నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ప్రాతినిధ్య హోదాను దక్కించుకున్న ఐఎన్టీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గుర్తింపు హోదాలో కొనసాగుతున్న ఏ ఐ టి యు సి సింగరేణి యాజమాన్యం కు, ప్రాతినిధ్య సంఘ హోదాలో పనిచేస్తున్న ఐ ఎన్ టి యు సి తెలంగాణలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తుగా మారి కార్మిక హక్కులను పరిరక్షి ంచడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఓవైపు సింగరేణి యాజమాన్యం, మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గని కార్మికుల సమస్యలను పరిష్కరించలేని సమయంలో ఆ రెండు సంఘాలు దిక్కు తోచక కార్మికులను మభ్యపెట్టడం కోసం కేవలం ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపడుతున్నాయని దుయ్యబట్టారు. వాస్తవానికి ఆ రెండు సంఘాలకు కార్మిక సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసి ఇచ్చిన హక్కులను సాధించి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను పక్కనపెట్టి ఆ రెండు సంఘాలు సింగరేణి యాజమాన్యంకు, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నాయని ఈ క్రమంలో గత మూడు సంవత్సరాలుగా సింగరేణి కార్మిక సమస్యలు పేరుకుపోయాయని దీంతో కార్మిక వర్గం ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో సమ్మె అంటూ కార్మికుల వద్ద పెడబొబ్బలు పెట్టి యాజమాన్యంతో చర్చలు జరిపిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టిసి కార్మికులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఆ రెండు సంఘాలు సైతం సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ప్రలోభాలకు తలొగ్గి జేపేసీ తలపెట్టిన సమ్మెను నీరుగార్చిందని ఆరోపించారు. సింగరేణిలో కార్మికులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు అనేకం ఉన్నప్పటికీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, పని చేతగాక సమస్యలను పరిష్కరించడం విఫలమయి బి ఎం ఎస్ వంటి జాతీయ సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కోల్ ఇండియా పరిధిలో బొగ్గు గని కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి వేతనాల అమలులో భారతీయ మజ్దూర్ సంఘ్ బి ఎం ఎస్ కట్టుబడి పని చేస్తూ వారి హక్కుల సాధనకు కృషి చేస్తుందని, అదేవిధంగా కనీస పెన్షన్ విధానం ఇతర సదుపాయాలను కల్పించడానికి జాతీయ స్థాయిలో కోల్ ఇండియాలో పటిష్టమైన పోరాటాన్ని బి ఎం ఎస్ కొనసాగిస్తుందని ప్రకటించారు. సింగరేణి పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ కొరకు అహర్నిశలు కృషి చేస్తామని, సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులుపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంటు చెల్లించుటకు తమ సంఘం పనిచేస్తుందన్నారు. సింగరేణి పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ.51,149 వేలకోట్లు సింగరేణి సంస్థకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.12వ వేజ్ బోర్డు కొరకు ప్రత్యేకమైన కృషి బిఎంఎస్ చేస్తుందని జూన్ 30 తేదీ తో కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో జూలై 1 వ తేదీ నుండి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అవుతున్నందున కోల్ ఇండియా యాజమాన్యం కమిటీ నిర్మాణానికి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం నివారణకు నిర్మూలనకు కార్యాచరణ మహాసభలలో చేస్తామని తెలిపారు, సింగరేణి సంస్థలో నూతన బొగ్గు గనుల ప్రారంభ దిశకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యం : మంత్రి అడ్లూరి

ఏడాదిలోపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

గొల్లపల్లి, ప్రభాతవార్త :



ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారుఆదివారం గొల్లపల్లి మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని చిల్వకోడూరు గ్రామంలో రూ.7.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న పెద్ద చెరువు తూము మరమ్మత్తు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండిపోయాయని,అవి పూర్తి కాకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సుమారు రూ.1,000 కోట్లు అవసరమవుతాయని, ఈ విషయమై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి లిఫ్ట్, మేడారం రిజర్వాయర్ నుంచి కొత్తపల్లి వరకు కాలువ పనులతో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



గొల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి అందజేశారు. మండలంలోని 17 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయగా, 72 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.26 లక్షల 12 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల కోసం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మంత్రి

గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ ఎదురు బోనాల ఉత్సవాల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు మంత్రికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలను ఎల్లప్పుడూ పోచమ్మ తల్లి చల్లగా కాపాడాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ సంతోష్, వైస్ ఛైర్మన్ పురపాటి రాజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, సర్పంచుల పోరం అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి జెల్ల అనిల్ యాదవ్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్ ప్రభాత వార్త :



అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తాం అని జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ పేర్కొన్నారు ఆదివారం పోచంపేట గ్రామంలో, లక్ష్మీదేవి పల్లి గ్రామంలో 10 లక్షల చొప్పున మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ భూమి పూజ చేసారు అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కూమర్ మాట్లాడుతూగ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు గ్రామాల్లో పల్లె దవాఖానాలు,మహిళా సమైక్య భవనాలు,కుల సంఘం భవనాలు జగిత్యాల నియోజకవర్గం లో అత్యధిక సీసీ రోడ్లు,డ్రైనేజీలు నిర్మించుకున్నామని అన్నారు ప్రభుత్వం తో కలిసి పని చేసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు పాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సగం లో నిర్మాణాలు నిలిస్తే కూడా నిర్మాణం పూర్తి చేయటం కోసం నిధులు మంజూరు చేస్తాం అని అన్నారు.రాష్ట్రం లో విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది అని అన్నారు పేదలకు ,ప్రభుత్వ పాఠశాల పిల్లలకు సన్న బియ్యం పంపిణీ తో నాణ్యమైన భోజనం ప్రభుత్వం అందిస్తున్నామని అన్నారు గ్రామాల్లో ప్లాస్టిక్ నివారణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.వర్షాలు బాగా పడాలని రైతు బాగుండాలి అని ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నందువల్ల రైతులు సన్న వడ్ల సాగు చేపట్టాలని అన్నారు. .ఈ కార్యక్రమంలో సర్పంచులు శేఖర్ జగదీష్ ఉప సర్పంచులు ఉపేందర్ సుజాత నరేష్ ప్రభాకర్ ఎంపీవో సలీం ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి పాక్స్ చైర్మన్ లు మల్లారెడ్డి నరసింహా రెడ్డిసర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సొల్లు సురేందర్ సర్పంచులు బాస మహేష్ రమేష్ రాధా రాజు శంకర్ రెడ్డి భాస్కర్ శేఖర్ గంగారెడ్డి శ్రీనివాస్ మండల నాయకులు కోల శ్రీనివాస్ రాజేందర్ రెడ్డి శేఖర్ గౌడ్ మర్రిపెల్లి రాజేశం లక్ష్మణ్ రాజు రాజన్న మల్లేష్ తోట లక్ష్మణ్ నరేష్ రామన్న మల్లేష్ రమేష్ శంకర్ కొమురయ్య మహిళలు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా డిమాండ్లు పరిష్కరించాలి

జంతర్ మంతర్ లో మా గళం వినిపించాం

జగిత్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:మా 11 డిమాండ్ల సాధనే లక్ష్యమని, మా పోరాటం ఆగదని ఢిల్లీ ర్యాలీలో జగిత్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు క్యారంగుల అరుణ అన్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన నాల్గవ తరగతి ఉద్యోగుల గ్రాండ్ ప్రొటెస్ట్ ర్యాలీ చారిత్రాత్మకమని, 11 డిమాండ్ల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అరుణ స్పష్టం చేశారు.ఢిల్లీలో ర్యాలీ అనంతరం అరుణ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. “దేశవ్యాప్తంగా వేలాది మంది ఖిడిఖిగ్రూప్ ఉద్యోగులు జంతర్ మంతర్‌ను హోరెత్తించి,మా ఆవేదనను కేంద్రానికి వినిపించామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 11 అంశాలపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం ఆగదని ఆమె పేర్కొన్నారు.“మే 22న బ్లాక్ బ్యాడ్జ్ నిరసనతో మొదలైన మా పోరాటం, ఆదివారం ఢిల్లీలో భారీ ర్యాలీతో మరింత ఉధృతమైందన్నారు. అసోసియేషన్ కేంద్ర సంఘం అధ్యక్షులు లూనావత్ దాస్య, ప్రధాన కార్యదర్శి ఖాదర్ బిన్ హసన్ నాయకత్వంలో ఐక్యంగా పోరాడుతున్నామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం నుంచి తరలివచ్చిన ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. “ఇది మాత్రమేనని, డిమాండ్లు నెరవేరే వరకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని అరుణ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్యక్షులు లూనావత్ దాస్య, అసోసియేట్ అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ బిన్ హసన్, సిటీ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, కార్యదర్శి అతిక్ పాషా,జగిత్యాల జిల్లా నుండి భాగ్య, తదితరులు పాల్గొన్నారు.



నేరాలు-దారుణాలు

వంద ట్రాక్టర్ల ఇసుక కుప్పలు సీజ్

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము పోతిరెడ్డిప ల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లి కేశవేని వెంకటేష్,ఆషాఢపు వినయ్, జీల పరశురాములు జీ ల అనిల్,గెల్లు శంకర్ లకు చెందిన అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్సై ఆవుల తిరుపతి ఆదివారం తెలిపారు. ఇదిలా ఉండగా మానేరు వాగు రోడ్డు వైపు అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక నిల్వలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.ఇసుకను అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వ్యవసాయ బావిలో లభించిన ద్విచక్ర వాహనం

మానకొండూర్, ప్రభాతవార్త :



మండలంలోని అన్నారం గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో హీరో ఫ్యాషన్ ద్విచక్ర వాహనం బావిలో లభించింది. ఆదివారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు అన్నారం గ్రామంలోని ఓ రైతు తన వ్యవసాయ బావిని పూడిక తీస్తుండగా జెసిపి బకెట్ కు ఏదో తగిలినట్లుగా అనిపించడంతో డ్రైవర్ దాన్ని బావిలో నుండి బయటకు తీయగా బైక్ అని తేలింది. వ్యవసాయ బావిలో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు పడింద, లేక ఎవరైనా కావాలని బావిలో పడేసి వెళ్లారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దశాబ్దం దాటినా వీడని బంధం

లక్ష్మీపూర్ జడ్పీహెచ్ఎస్ లో పూర్వ విద్యార్థుల సందడి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ఆదివారం గురుశిష్యుల అపురూప కలయికకు వేదికైంది. ఈ పాఠశాలలో 2009-2010 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘ కాలం తర్వాత ఒకే తాటిపైకి వచ్చి,ఆత్మీయ సమ్మేళనం పేరిట ఘనంగా వేడుక నిర్వహించుకున్నారు. నిత్యం ఉరుకుల పరుగుల జీవితాలతో బిజీగా ఉండే పూర్వ విద్యార్థులంతా దశాబ్ద కాలం పైగా దాటిన తర్వాత తమ పాత మిత్రులను,గురువులను కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పి,సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన గురువులు సూరజ్, శివశంకర్,రవీందర్,నరసయ్య,జగన్,చంద్రశేఖర్ రవీంద్రనాథ్, లక్ష్మీకాంతం శ్రీనివాస్ లను వేదికపై ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి,జ్ఞాపికలను బహూకరించి,తీపి పదార్థాలు తినిపించి తమ గురుభక్తిని చాటుకున్నారు.అంతకుముందు కీర్తిశేషులైన ఉపాధ్యాయులు శంకరయ్య,గోపాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ,వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గురువులు, పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు.తాము పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను,ఆనాటి అల్లరి పనులను, గురువుల శిక్షణను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.విద్యార్థులు క్రమశిక్షణతో,ఉన్నత లక్ష్యాలతో జీవితంలో మరింతగా స్థిరపడాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.ఈ అపురూప వేడుకలో పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు, పాఠశాల పూర్వ,ప్రస్తుత సిబ్బంది,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



జువ్వాడి నర్సింగరావు రజనీ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ నేతలు...

కోరుట్ల, ప్రభాత వార్త



పట్టణం లోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు రజనీ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేసి కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ జువ్వాడి నర్సింగరావు ఇలాంటి వివాహ వార్షికోత్సవ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ నాయకులు పుప్పాల ప్రభాకర్ రిజ్వాన్ ఆర్ భూమయ్య నజ్జు ఏతిరాజం నర్సయ్య రియాజ్ అక్బర్ నేతి శ్రీనివాస్ రాజేశం దండవేని వెంకటేష్ సంఘ లింగం నేతి శ్రీనివాస్ చెట్మెల్లి రంజిత్ జిందం లక్ష్మీ నారాయణ ఆరేల్లి వెంకటి గుప్తా ఎంబేరి సత్యనారాయణ కయ్యూం రాజేంద్రప్రసాద్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా 'వీడీఎస్ నృత్య ప్రదర్శన

కోరుట్ల, టౌన్, ప్రభాత వార్త



పట్టణంలోని వీడీఎస్ వంశీ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహించిన "వీడీఎస్ నృత్య సీజన్-2 ది బ్లాస్ట్" కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, కోరుట్ల సీఐ లక్ష్మీ నారాయణ, సేనాపతి ప్రవీణ్ కుమార్ , టేకుల నరేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలలో పోటీ తత్వాన్ని పెంచి వారిలో ఉన్న కళా ప్రతిభను వెలికితీసి వారికి సరైన వేదికను కల్పిస్తున్న నృత్య కలకారుడు వంశీ అభినందనీయుడని ఇలాగే పట్టణ, గ్రామీణప్రాంతాలలో కళల పట్ల ఆసక్తి కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని ఇలాంటి అవకాశలను పిల్లలు వియోగించుకోవాలని ఆకాంక్షి ంచారు. కోరుట్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన చిన్నారులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అద్భుత నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థి తన ప్రతిభను ప్రదర్శించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

హైదరాబాద్ లో ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యం

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అంకం రాజేశం, వనిత దంపతుల కుమారుడు అంకం రాహుల్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం పూర్తి చేసి ఓ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. గత పదిరోజుల క్రితం నుంచి అతను కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్న సంస్థ వద్ద కొంత వివాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు చెబుతుండగా, ఆ తర్వాత హాస్టల్‌కు వెళ్లిన రాహుల్ అక్కడి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని సమాచారం. కాచిగూడ ప్రాంతంలో రాహుల్ నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదు కాగా అతని ఆచూకీ తెలియరాలేదు.రాహుల్ కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో గాలించినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. తమ కుమారుడి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం అందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీ సత్యానంద మహర్షి 500వ సంచార సత్సంగ మహోత్సవాలు

కోరుట్ల, అర్బన్, ప్రభాత వార్త



పట్టణంలోని కావేరి గార్డెన్స్‌లో జూన్ 5, 6, 7 తేదీలలో నిర్వహించిన 500వ సంచార సత్సంగ మహోత్సవాలు భక్తుల అపూర్వ స్పందన మధ్య అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ మహోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, గురుస్మరణ, ధ్యాన కార్యక్రమాలు, సత్సంగాలు, శాంతి మంత్రాలు నిర్వహించబడ్డాయి. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సుమారు 50 మంది పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు పాల్గొని భక్తులకు



ఆధ్యాత్మిక సందేశాలు అందించారు. మహోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొని గురుదేవుల ఆశీస్సులు పొందారు. భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమంలో పీఠాధిపతులు అయినటువంటి ఆచార్య శ్రీహరి తీర్థ స్వాముల వారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం అందించారు. కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు, గురుపాదుకా పూజలు, ప్రత్యేక ఆశీర్వచనాలు నిర్వహించబడ్డాయి. చివరి రోజు నిర్వహించిన మహాసభలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి వారి జీవితం, బోధనలు, సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. గురుదేవులు ప్రారంభించిన సత్సంగ పరంపర 500వ మైలురాయిని చేరుకోవడం ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన దాతలకు, భక్తులకు, సేవాదళ సభ్యులకు, వివిధ కమిటీల ప్రతినిధులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాల వేడుకలు....

రామడుగు, ప్రభాతవా ర్త

రామడుగు మండలం వెదిర గ్రామంలో శ్రీ వినాయక రెడ్డి సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ తల్లి బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటింటా బోనాలు తీసుకొని ప్రధాన రహదారుల వెంట ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లి దేవాలయం వద్ద నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు .బైండ్ల పూజారిని ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ వినాయక రెడ్డి సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



కోరుట్ల వార్త



కస్తూర్బా లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల/ ప్రభాతవార్త

మల్యాల కస్తూర్బా పాఠశాలలో 2026!!27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ కంప్యూటర్ సైన్స్ ఇంగ్లీషులో బోధించుటకు గాను గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు, కంప్యూటర్ సైన్స్ బోధనకు బిఈ లేదా బీటెక్ (సి ఎస్ సి, ఐ టి ఎం ఎస్) ఇంగ్లీష్ బోధనకు ఎం ఏ ఇంగ్లీష్, బిఈడి అర్హతలతో పాటు బోధన అనుభవం కలిగి ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 11వ సాయంత్రం 4:30 లోగా తమ పూర్తి విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో కస్తూర్బా లో దరఖాస్తులు అందజేయాలని స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు,

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం

సాంకేతిక విద్యా సేవలకు గుర్తింపు

చొప్పదండి,ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలానికి చెందిన కోమ్ముల రమణ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ హక్కులపై అవగాహన కల్పించడం, అలాగే యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం ఎల్), ఆధునిక సాంకేతిక విద్యను అందించడంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఇండియా) తెలంగాణ రాష్ట్ర ఐటీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అన్యాయాలు, ఉద్యోగ సంబంధిత సమస్యలు, హక్కుల ఉల్లంఘన వంటి అంశాలపై బాధితులకు మార్గదర్శకత్వం అందిస్తూ, అవసరమైన న్యాయ సహాయం పొందేందుకు సహకరిస్తున్నారు. అదే విధంగా విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై శిక్షణ అందిస్తూ వారి కెరీర్ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.ఈ సేవలను గుర్తించిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఇండియా) సంస్థ ఆయనకు ఈ గౌరవప్రదమైన బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా కోమ్ముల రమణ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ, యువత అభివృద్ధి, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

వినియోగదారులు విద్యుత్ బకాయిలను గడువులోగా చెల్లించాలి

మల్యాల అకౌంట్స్ ఆఫీసర్ గుండి రవీందర్

మల్యాల/ ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను గడువులోగా చెల్లించి సంస్థకు సహకరించాలని మల్యాల విద్యుత్ సహాయ గణాంక అధికారి గుండి రవీందర్ కోరారు, సాధారణంగా గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్ల రీడింగ్ తీసిన బిల్లులను 14 రోజుల గడువులోగా చెల్లించాల్సి ఉంటుందని, గడువు దాటితే అపరాధ రుసుము కూడా అదనంగా బిల్లులో భారం పడుతుందన్నారు, అంతేకాకుండా సకాలంలో బిల్లు చెల్లించని యెడల విద్యుత్ కనెక్షన్లను కూడా తొలగించబడుతుందని, అపరాధ రుసుము లేకుండా వినియోగదారులు తమ బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు, ఇదిలా ఉండగా, మల్యాల ఈ ఆర్ ఓ పరిధిలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలలో మొత్తం 98764 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, గృహ జ్యోతి లబ్ధిదారులకు 200 లోపు యూనిట్లు వినియోగించితే జీరో బిల్లు, దాటితే రీడింగ్ ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు, అంతేకాకుండా ఈ నాలుగు మండలాల పరిధిలో వీధి దీపాలు, వాటర్ వర్క్స్ సంబంధించిన బిల్లులు గత మూడు ఏళ్ల గా బకాయిలు పేరుకుపోయాయని వాటిని గ్రామపంచాయతీలో వెంటనే చెల్లించాలని ఆయన కోరారు, అంతేకాకుండా వివిధ కేటగిరి కనెక్షన్ పొంది బకాయిలు పెండింగ్లో ఉన్నవారంతా వెంటనే తమ విద్యుత్ బిల్లులను చెల్లించాలని అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్ కోరారు,

అంగన్వాడీలలో నాణ్యమైన పోషకాహారం తప్పనిసరి

జిల్లా ఆహార భద్రతాధికారి సునీత

నిర్మల్ జిల్లా ప్రతినిధి: జూన్ 07, ప్రభాతవార్త:





అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా ఆహార భద్రతాధికారి సునీత స్పష్టం చేశారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, సమాజంలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమన్నారు. ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అంగన్వాడీ ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

పరిశుభ్రత, పోషక విలువలకు ప్రాధాన్యం

అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం ద్వారా రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

నిరంతర పర్యవేక్షణ

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహార నియమాలు అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని సునీత వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, అంగన్వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే తరలించి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

మంచిర్యాల జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

వేమనపల్లి, జూన్ 07, ప్రభాతవార్త:

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే తరలించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూడాలని మంచిర్యాల జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడ,వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, దస్నాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ క్రమంలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని త్వరితగతిన కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం తరలింపు కొరకు అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం వేమనపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి



అధికారులతో కలిసి వరి ధాన్యం తరలింపునకు కావలసిన రవాణా సౌకర్యానికి సంబంధించిన కార్యాచరణ పరిశీలించి, రవాణా గుత్తేదారులతో చరవాణి ద్వారా మాట్లాడి అదనపు లారీలను కేటాయించాలని, రానున్న వర్షాకాలం దృష్ట్యా కొనుగోలు చేసిన వరి ధాన్యం యుద్ధ ప్రాతిపదికన ఈరోజు రాత్రి కల్లా తరలించి జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

ప్రభాత వార్త కోనరావుపేట:



తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు కోనరావుపేట మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సీనియర్ నాయకుడు నూనె మల్లేష్ యాదవ్, మండల ఇంచార్జ్ కులేరు వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గ అబ్జర్వర్ ఎత్తరి మారయ్య, నియోజకవర్గ ఇంచార్జ్ వరద సతీష్ కుమార్, సంకెపల్లి సుమలత సుధాకర్ శర్మ, గుంటుక సంపత్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ప్రవేశపెట్టిన "పాంచజన్యం"లో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత కరెంట్, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీకి ప్రజాదరణ మరింత పెరుగుతుందని, ప్రజలు పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తోట కనకయ్య, సాలెంద్ర నవీన్, లక్కం సతీష్, సాయి ప్రణీత్, బయికడి ఆంజనేయులు, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల రమేష్, కదిరే భాస్కర్, జావీద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన కరీంనగర్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలామ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా కు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే లో సత్తాచాటి బ్లాక్ బెల్ట్ సాధించారు.కరీంనగర్ లోని వివేకానంద రెసిడెన్సియల్ స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీల్లో జగిత్యాల ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన శిక్షకుడు మర్రిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎస్.చక్రి ,కె. సాయి చరణ్, బి. సౌమిత్ రాజ్, కె. చైతన్య విశేష ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నారు.ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ కే వసంత్ కుమార్ బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు.బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులను కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలం ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని ముఖ్యంగా యువత వ్యసనాలకు అలవాటు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అమ్మాయిలు ఆత్మ రక్షణ విద్య కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ మరిపెల్లి లింగయ్య, ఎంఏ మన్నన్, అనంతుల కాంతారావు, నరేష్,రాజశేఖర్,సంతోష్,రాము,తదితరులు పాల్గొన్నారు.



విద్యా బోధనకు దరఖాస్తులకు ఆహ్వానం

చందుర్తి / ప్రభాతవార్త:

ప్రాథమిక పాఠశాలలో పూర్వ బోధకుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు మండల విద్యాధికారి వినయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో నూతనంగా మంజూరైన నాలుగు ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్గల్, నర్సింగాపూర్,జోగాపూర్, సనుగుల పాఠశాలలో బోధించడానికి మహిళా బోధకులు,ఆయాల నియామకానికి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. పూర్వ ప్రాథమిక బోధకులకు ఇంటర్మీడియట్, లేదా దానికి సమానమైన ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్, ప్రైమరీ టీచింగ్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆయా పోస్టుల నియామకానికి ఏడవ తరగతి చదివి ఉండాలన్నారు. పోస్టుల నియామకానికి గరిష్ట వయస్సు 44 సంవత్సరాలు కాగా ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల వారికి నిబంధనల మేరకు సడలింపు అమలు చేయనున్నట్లు తెలిపారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు.దరఖాస్తులకు సంబంధించిన పత్రాలతో 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మండల విద్యా వనరుల కేంద్రంలో సమర్పించాలని పేర్కొన్నారు.

గాలి దుమారంలో పోలీసుల తక్షణ స్పందన

రోడ్డుపై కూలిన చెట్ల తొలగింపు

ప్రజల భద్రతకు ప్రాధాన్యం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలిదుమారం కారణంగా పలుచోట్ల చెట్లు రహదారులపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే వేములవాడ రూరల్ ఎస్సై వెంకటరాజం ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు.నాగయ్యపల్లి గ్రామంలో కూలిన చెట్లను తొలగించే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశం కూడా పాల్గొని పోలీసులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గంటల్లోనే పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రహదారులను సాధారణ రాకపోకలకు అనుకూలంగా మార్చారు. గాలి దుమారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే తమ తొలి లక్ష్యమని, ఎలాంటి విపత్తు వచ్చినా ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు.స్థానికులు పోలీసుల తక్షణ స్పందనను అభినందిస్తూ, చెట్లను వెంటనే తొలగించి రాకపోకలు పునరుద్ధరించడం వల్ల పెద్ద ప్రమాదాలు తప్పాయని పేర్కొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ చింతకుంట మల్లేశం సహకారాన్ని కూడా కొనియాడారు..."ప్రజల కోసం... ప్రతి క్షణం... మీతో మేముంటాం" అనే నినాదాన్ని వేములవాడ రూరల్ పోలీసులు మరోసారి కార్యరూపంలో చూపించారు.

బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి బోగ శ్రావణిని కలిసిన తోట్లవాయి గ్రామస్తులు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా రాయికల్ మండల్ తాట్లవాయి మరియు అలియా నాయక్ తండా గ్రామ ఉప సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు ఆదివారం బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్. బోగ శ్రావణిప్రవీణ్ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ఎంపీ నిధుల ద్వారా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయవలసిందిగా వినతిపత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో తాట్లవాయి ఉప సర్పంచ్ నారాయణ, అలియా నాయక్ తండా ఉపసర్పంచ్ గణేష్,అంజిత్, జి.రెడ్డి,.గంగాధర్, రాజు సంతోష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జువ్వాడి పెళ్లి రోజు వేడుకలు

మల్లాపూర్,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు పెళ్లిరోజు వేడుకలు మల్లాపూర్ మండల కేంద్రం లో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.మండలం లోని అన్ని గ్రామాలనుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య మాట్లాడుతూ జువ్వాడి నర్సింగ్ రావు దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస్ రెడ్డి,పూండ్ర లక్ష్మా రెడ్డి,మరిపెల్లి



మల్లయ్య,ఆడెపు ఆనంద్ గౌడ్,సిరిపురం రవీందర్,క్యాతం మల్లారెడ్డి,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,ఎర్ర భూమయ్య, మహమ్మద్ రఫీ,పూండ్ర సోమ రెడ్డి, మిట్టపల్లి జీవన్ రెడ్డి, నూతిపెల్లి రాజం,గోపిడి శేఖర్ రెడ్డి,గడ్డం(తిప్పిరెడ్డి)అంజిరెడ్డి,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో అవినాష్ కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



జిల్లా కేంద్రంలో పవన్ కరాటే అకాడమీ ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో వివిధ జిల్లాల నుండి 600 మంది వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా.. మెట్పల్లి మండల కేంద్రం నుండి అవినాష్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ నుండి 9 విద్యార్థిని విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరిచారు.కాటాస్,స్పారింగ్ విభాగంలో అండర్ 14విభాగంలో జాహ్నవి, పవిత్ర, మణింద్ర,సంధ్య ప్రథమ స్థానం బంగారు పతకం గెలుపొందగా.. అండర్ 10 విభాగం లో విశృతి, శ్రీ మాన్వీ, ప్రథమ స్థానం బంగారుపతకం గెలుపొందగా.. అండర్12 విభాగంలో ఆరాధ్య,శ్రీ హర్ష, శోభన్ ద్వితీయ స్థానం వెండి పథకాలు, అండర్14 విభాగంలో కిషోర్ తృతీయ స్థానం లో గెలుపొందారని జగిత్యాల డిస్ట్రిక్ట్ చీఫ్ ఇన్స్పక్టర్ మాస్టర్ వసునూరి అవినాష్ తెలిపారు.ఈకార్యక్రమంలో ఇన్స్పక్టర్లు జోగు శివాని, తిమ్మని రోహిత్,తిమ్మని రోషన్,తదితరులు పాల్గొనగా..పోటీలలో గెలుపొందిన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

ప్రపంచ తెలుగు మహా సభల్లో మెట్ పల్లి కవులు

మెట్‌పల్లి కల్చరల్,ప్రభాత వార్త:

రాజమహేంద్రవరం లో శనివారం ప్రారంభం అయిన 7 వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మెట్ పల్లి జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు పాల్గొని, తమ కవితల్ని వినిపించారు. మెట్ పల్లి జాతీయ సాహిత్య సభ్యులు అయిన పెండెం శివానంద్, సొప్పరి శ్రీనివాస్, తంగళ్లపల్లి నవీన్ కుమార్ లు శనివారం రాజమండ్రిలో జరిగిన సభల్లో పాల్గొని తెలుగు భాషా ఔన్నత్యం పై కవితగానం చేసారు. అనంతరం వీరు నిర్వాహకుల చేత సన్మానం తో పాటూ మెమెంటో అందుకున్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని మెట్ పల్లి జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నంబి రాజేంద్ర శర్మ, ప్రధాన కార్యదర్శి మర్రి భాస్కర్, కోశాధికారి గుంటుక అశోక్, ప్రచార కార్యదర్శి వసునూరి శ్రీనివాస్, పెరంబుదూర్ లింబగిరి స్వామి, బండి సుధాకర్, బాస మంజుల, గుంటుక గంగాధర్, గౌరవ



అధ్యక్షులు మట్టెల గంగాధర్, ఉపాధ్యక్షుడు గుర్రాల మాధవ్, ఉపాధ్యక్షురాలు మాడభూషి భూలక్షి మ్మ లు వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారు భవిష్యత్తు లో సాహితి రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షి ంచారు.

జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ఇరుకుల్ల వీరేశం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా పురస్కారం

ఓదెల,ప్రభాతవార్త:ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం మరోసారి జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుకొని ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు హైదరాబాద్ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన ఆల్ ఇండియా పోయిఆర్ట్ కాంపిటిషన్ అండ్ ఎగ్జిబిషన్-2026లో ఆయన తీసిన ఛాయాచిత్రం తృతీయ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు చేతుల మీదుగా స్వీకరించారు.దేశవ్యాప్తంగా కళాకారులు పంపించిన 820 కళాఖండాల్లో జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన 250 ఉత్తమ కళాఖండాలు ప్రదర్శనకు ఎంపిక కాగా, వాటిలో వీరేశం రూపొందించిన ఛాయాచిత్రం ప్రత్యేక గుర్తింపు పొందింది. ఒడిశాలో గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఛాయాచిత్రానికి ఈ పురస్కారం దక్కింది.ఫోటోగ్రఫీ రంగంలో ఇప్పటికే అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో అనేక పురస్కారాలు అందుకున్న ఇరుకుల్ల వీరేశం, తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 5వ ఎడిషన్ పోటీల్లో కూడా తృతీయ బహుమతి సాధించడం విశేషం. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ, సాధారణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనకు దేశంలోని ప్రముఖ కళాకారులతో పోటీపడి బహుమతి అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఫోటోగ్రఫీ తనకు ప్రాణమని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రకృతి అందాలు, పండుగలు, గిరిజనుల జీవన విధానాన్ని చిత్రీకరిస్తున్నానని తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, జేఎన్ఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ ఆనంద్ గడప, చిత్రమయి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





మెట్‌పల్లి వార్త

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సన్మానం

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



మెట్‌పల్లి పట్టణంలో ఆత్మకూర్ ఆత్మనగర్ సెటిలర్స్ పద్మశాలి సుధారక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 10వ, 11వ, 12వ తరగతుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి, విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ సంఘం నాయకులు వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నడికట్ల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంగుల అంజయ్య, బండి సుధాకర్, ప్రధాన కార్యదర్శి మ్యాన లింబాద్రి, కోశాధికారి మ్యాన ప్రసాద్, సహాయ కార్యదర్శి విజయ్, ఎలక్షన్ కమిటీ అధ్యక్షుడు మ్యాన శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జువ్వాడి నర్సింగరావు వివాహ వార్షికోత్సవ వేడుకలు

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



తెలంగాణ వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రైస్ ఉద్దీన్, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి లు కట్ చేసి సంబరాలు జరిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జువ్వాడి నర్సింగరావు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని, దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముకీమ్, ద్వావనపల్లి రాజారాం, పిప్పెర రాజేష్, నాగభూషణం, రాజగోపాల్, బుర్ర మహేందర్, షేక్ మహమ్మద్, సమ్ము, నేమూరి లవ్ కుమార్, మార్గం కిరణ్ కుమార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నాయని సురేష్ గౌడ్, జెట్టి లక్ష్మణ్, పులిమామిడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శి ఏనుగు ముత్యం రెడ్డి సన్మానించిన బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి భోగ శ్రావణి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా నూతనంగా నియమితులైన ఏనుగు ముత్యం రెడ్డి బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్. బోగ శ్రావణి ని ఆదివారం వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలవగా వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, ప్రధాన కార్యదర్శిలు ఏనుగు రవీందర్ రెడ్డి, బండారి సాయిరాజ్,వట్టిమల్ల శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.



వర్షాలు కురియాలని రామాలయంలో పూజలు

ముడుపు విప్పి స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



గంభీరావుపేట, ప్రభాతవార్త

వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ రైతులు ఆదివారం గంభీరావుపేట మండల కేంద్రంలోని రామాలయంలో పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా జరిగే ఆలయ బ్రహ్మోత్సవాల అనంతరం రబీ సీజన్లో అకాల వర్షాలు కురిసి పంటలు పాడవకుండా రైతులు ఆలయంలో ముడుపు వేశారు. కోతలు పూర్తయి వర్షాకాలము ప్రారంభమైన దృష్ట్యా ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, వేసిన ముడుపును విప్పారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయంలోని స్వామివారి ఉత్సవమూర్తులను శావపై గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తెర్లుమద్దిలో వడ్ల కొనుగోళ్లు పూర్తి

ముస్తాబాద్ ప్రభాత వార్త:



తెర్లుమద్ది ఐకేపీ ఆధ్వర్యములో నిర్వహించిన వడ్ల కొనుగోలు కేంద్రాలు ఆదివారం తో ముగిసాయని గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ తెలిపారు. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావాడానికి సహకరించిన ఐకేపీ నిర్వాహకురాలు, హమాలి కార్మికులు, గ్రామ రైతులకు, మిల్లర్ నిర్వాహకులకు గ్రామ సర్పంచ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఐకేపీ నిర్వాహకురాలు, హమాలి కార్మికులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఘనంగా పోచమ్మ బోనాలు



ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపల్లి, పొత్తూరు గ్రామాలలో ఆదివారం పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లపెల్లిలో రెడ్డి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకోగా, గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచులు అర్చన, అశ్విని, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వేణు, సంఘం నాయకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తుల వినతి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామా నికి ఆర్టీసీ బస్సును పెద్దమ్మ గుడి వరకు పునరుద్ధరించాలని పాలకవర్గం, గ్రామస్తులు కరీంనగర్ డిపో 1 మేనేజర్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య మాట్లాడుతూ పెద్దలింగాపురం గ్రామంలోకి కరీంనగర్ డిపో 1 బస్సు ప్రతి రోజూ ఉదయం సాయంత్రం బస్టాండ్ వరకు నడుస్తుందని,, ప్రస్తుతం గ్రామంలోకి రాకుండా, గ్రామము చివరన ఉన్న పెట్రోల్ బంక్ రోడ్డు మీదుగా నడుపుతుండడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలో నుండి పెట్రోల్ బంక్ వరకు వచ్చి బస్సు ఎక్కాలంటే వికలాంగులు, వృద్ధులు ఇతరులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెద్దమ్మ గుడి వరకు బస్సు ను పునరుద్దించాలని కోరుతూ కరీంనగర్ డిపో1 మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడంతో రూట్ మ్యాప్ చేయించి తప్పకుండా బస్సును పునరుద్దిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని వెల్జీపురం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్య నభ్యసించిన 20052006 బ్యాచ్ కు చెందిన పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. గత జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు కె రాజయ్య, పి శివకుమార్, ఐ రవీందర్ రెడ్డి, ఎ కిషన్, జయసేనా రెడ్డి, ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, దేశెట్టి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, ఉమాశరత్ శ్రీ తదితరులు పాల్గొన్నారు

వార్తకు స్పందన



ముస్తాబాద్ ప్రభాత వార్త:

ఇటీవలే ప్రచురించిన ప్రయాణ ప్రాంగణం అనే బోర్డు లేక ఇబ్బందులు అనే కథనానికి స్పందించిన సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రయాణ ప్రాంగణం అనే బోర్డును(సూచిక)ను ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ముస్తాబాద్ మండల నూతన బస్టాండ్ కు బోర్డు లేక, సమయ పాలన సూచికలు లేక, రూట్ మ్యాపింగ్ లేక, ప్రయాణీకుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు, ఇప్పుడు ముస్తాబాద్ నూతన బస్టాండ్ కు ప్రయాణ ప్రాంగణం అనే బోర్డుతో కళ ఏర్పడిందని ప్రయాణికులు ముచ్చటిస్తున్నారు.

సిరిసిల్ల వార్త

అణగారిన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు సావిత్రిబాయి పూలేల కృషి

గంభీరావుపేట, ప్రభాతవార్త:



అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే లు ఎనలేని కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే పిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం అన్నారు. గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన అధ్యక్షతన ఆదివారము గంభీరావుపేట మండలం నర్మా ల గ్రామంలో నెలకొల్పిన మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ పిసిసి అధికార ప్రతినిధి తో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, జిల్లా బిజెపి అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మాజీ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట ఆగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి, విద్యా వికాసానికి జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలేలు మార్గదర్శకులని పేర్కొన్నారు. సమాజంలోని యువత మహనీయుల జీవితాలను అధ్యయనం చేసి వారి స్ఫూర్తితో దేశాభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వారి స్ఫూర్తితో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సమాజానికి వారు చేసిన సేవలు చిరస్మియంగా నిలుస్తాయన్నారు. ముఖ్యంగా మహిళా విద్యకు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు దేశ చరిత్రలో మరువలేనివని కొనియాడారు. నర్మాల మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా వారి గొప్ప సేవలను భావితరాలకు చాటిచెప్పే అవకాశం దక్కిందన్నారు. కార్యక్రమం విజయవంతం చేసిన ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి పర్వ హనుమాన్లు, మండల కాంగ్రెస్ బిజెపి అధ్యక్షులు హమీద్, కోడె రమేశ్, మాజీ సర్పంచ్ నిమ్మల తిరుపతి గౌడ్, రాజబోయిన ఆంజనేయులు, చాత్రబోయిన రాజు లతోపాటు ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి కోఆర్డినేటర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన పీసీసీ కో ఆర్డినేటర్, జగిత్యాల నియోజకవర్గం సర్ ప్రోగ్రాం మాస్టర్ ట్రెనర్ దర్శనం. వినోద్ కుమార్ సార్ ప్రోగ్రాం ద్వారా చేపట్టబోవు కార్యక్రమం ను వివరించారు. ఈ కార్యక్రమం లో డీసీసీ అధ్యక్షులు గాజెంగి. నందయ్య పీసీసీ సభ్యులు నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, సీనియర్ నాయకులు దామోదర్ రావు, సమిండ్ల.శ్రీనివాస్, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మన్సూర్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ కన్నా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గంలో 30 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ అంతర్గం గ్రామంలో ఆదివారం రోజున పలు అభివృద్ధి పనులకు శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఇరవై లక్షల రూపాయల నిధులతో నూతన గ్రామపంచాయతీ భవనం, మరో పది లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జగిత్యాలను విద్యా,వైద్య రంగాలుగా తీర్చిదిద్దుతున్నామని, ఇందులో భాగంగా 235 కోట్లతో నూతన ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. నియోజకవర్గంలో పేదలకు అత్యధికంగా ఇళ్ల మంజూరు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని,అంతర్గం గ్రామంలోని లబ్ధిదారులకు త్వరలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేయాలని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మడం లేదని, నియోజకవర్గ ప్రజలే తన కుటుంబ సభ్యులని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ముఖ్యంగా గ్రామాన్ని



ప్లాస్టిక్ రహితంగా మార్చి పచ్చదనం,పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని పిలుపునిచ్చారు. లింగం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని,చెరువులు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామస్తులందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి,ఆత్మ ఛైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి,సర్పంచ్ నోముల రమ్య శేఖర్,ఉప సర్పంచ్ గోడిసెల బాలు,మాజీ ఏఎంసీ ఛైర్మన్లు కొలుగురి దామోదర్ రావు,నక్కల రాధ రవీందర్ రెడ్డి,ఎంపీడీవో రమాదేవి,ఎమ్మార్వో హకీమ్,డీఈ మిలింద్,ఎంపీఓ రవిబాబు,ఏఈ విజయ్,మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జగిత్యాల విద్యార్థిని ఎంపిక



జగిత్యాల, ప్రభాతవార్త:

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అండర్13 బాలికల కరీంనగర్ జిల్లా స్థాయి అధికారిక చెస్ ఎంపిక పోటీలలో ఖిజగిత్యాల మాస్టర్ మైండ్ చెస్ అకాడమీఖి విద్యార్థిని పేరాల కృష్ణిక అద్భుత ప్రతిభ కనబరిచింది. హోరాహోరీగా సాగిన ఈ అసోసియేషన్ స్థాయి సెలెక్షన్స్ లో కృష్ణిక తన మేధోశక్తి, వ్యూహాత్మక ఆటతీరుతో అద్భుత విజయాలను నమోదు చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు అధికారికంగా అర్హత సాధించింది. ఈ సందర్భంగా జగిత్యాల మాస్టర్ మైండ్ చెస్ అకాడమీ ఫౌండర్ మరియు హెడ్ కోచ్ కంది అజయ్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీలలో తమ అకాడమీ విద్యార్థిని గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికవడం అకాడమీకే కాకుండా జిల్లా మొత్తానికి ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. పేరాల కృష్ణిక నిరంతర కృషి, పట్టుదలే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో కూడా తను ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలుస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఘన విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన జగిత్యాల మాస్టర్ మైండ్ చెస్ అకాడమీ విద్యార్థిని పేరాల కృష్ణికను, ఆమెకు ఉత్తమ శిక్షణ అందించిన కోచ్ కంది అజయ్‌ను, అలాగే కృష్ణిక తల్లిదండ్రులను జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభతోనే గుర్తింపు సాధ్యం

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి

శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పురస్కార్ కార్యక్రమం

జగిత్యాల అర్బన్, ప్రభాతవార్త:





ప్రతిభతోనే సమాజంలో గుర్తింపు సాధ్యమని జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ లు అన్నారు.ఆదివారం మండలంలోని మల్యాల క్రాస్ రోడ్డులో గల కొత్త సురేశ్ ఫంక్షన్ హాలులో, ..శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్.. ఆధ్వర్యంలో 202526 విద్యా సంవత్సరానికి గాను "జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య ప్రతిభా పురస్కార్".. కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

120 మందికి పైగా విద్యార్థులకు సత్కారం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 120 మందికి పైగా ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అలాగే వారిని తీర్చిదిద్దిన తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ... గత 7 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తూ వారిలో ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, సమాజ సేవకు ఉపయోగపడే ఉన్నతమైన చదువులు చదివి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షి ంచారు. ఉన్నతమైన విద్యతో పాటు లోకజ్ఞానాన్ని కూడా కలిగి ఉండాలని సూచించారు. చదువుతో పాటు తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ముందుగా వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ పబ్బ శ్రీనివాస్, జగిత్యాల, మెట్పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వూటూరి నవీన్, మైలారపు రాంబాబు, ఆర్టీఏ సభ్యుడు కంటాల శ్రీనివాస్, ప్రముఖ నాయకులు బుడికె శ్రీకాంత్, పల్లెర్ల రాజు, మర్యాల రాజన్న, కట్కం రాజేశ్, భూసం సతీష్, కట్కూరి సంతోష్, బొడ్ల జగదీశ్, చెట్ల పవన్ మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి సూచించారు.జగిత్యాల మండలం రూరల్ కల్లేడ గ్రామంలో తేజ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ,మలేరియా,వైరల్ జ్వరాలతో పాటు అతిసార వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని



హెచ్చరించారు.ప్రజలు తమ నివాసాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు.జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే నిరక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి సకాలంలో చికిత్స పొందాలని ఆయన స్పష్టం చేశారు. శిబిరంలో తేజ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వేణు పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తగిన వైద్య సలహాలు, సూచనలు అందించారు.వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది,స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పరశురాం మాట్లాడుతూ,గ్రామీణ ప్రజలకు అందు బాటులో ఉండి ఉచిత వైద్య సేవలు అందించడం పట్ల నిర్వాహకులను అభినందించారు.

జగిత్యాల వార్త

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాయికల్ ప్రభాతవార్త:



రాయికల్ పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 2004-05 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు రెండు దశాబ్దాల కాలం తర్వాత ఆదివారం రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు తమ పాఠశాల జ్ఞాపకాలు ను పంచుకున్నారు ఆనాడు తమకు వివిధ సబ్జెక్టులను బోధించిన ఉపాధ్యాయులు నాగభూషణం మీనయ్య జయ శిరీష జ్యోతి పొన్నం రమేష్‌ల బోధనాలను గుర్తు చేసుకున్నారు .ఈ సందర్భంగా 200405 బ్యాచ్ విద్యార్థులు పలువురు పూర్వ విద్యార్థులు తమ విజయాలకు పాఠశాల అందించిన విద్య ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమని పలువురు అన్నారు ప్రస్తుత విద్యార్థులకు విద్యా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు ఇరవైసంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకునే అవకాశం వచ్చిందని ఆనందించారు.ఉపాధ్యాయులు పొన్నం రమేష్ మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే స్థాయికి విద్యార్థులు ఎదగడం గర్వకారణంమని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్రం రజిత రాణవేణి గంగమణి ఇంద్రాల రజని బైరి శ్రీకళ మచ్చ ప్రత్యక్ష రాధ రాజ్యలక్ష్మి ఉడత మానస తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసులకు రాష్ట్ర స్థాయి గజల్ పురస్కారం

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:



కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల ప్రధాన అడ్మిన్ కవయిత్రి మద్దెల సరోజన, కవయిత్రి సిరిపురం వాణిశ్రీలకు రాష్ట్ర స్థాయి గజల్ పురస్కారం ప్రముఖ జాతీయ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ తో అందజేశారు.రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్ గజల్ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం 60 వసంతాల తెలుగు గజల్ వజ్రోత్సవం తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారంగజల్ కవి సమ్మేళనం జరిగింది. జగిత్యాలకు చెందిన ప్రముఖ కవయిత్రి జగిత్యాల జిల్లా తొలి గజల్ కవయిత్రి మద్దెల సరోజన, సిరిపురం వాణిశ్రీ తన గజల్ గానంతో అలరించారు. కళాశ్రీ అధినేత గుండేటి రాజు , అయిత అనిత, లక్కరాజు శ్రీలక్ష్మీ, కటుకం కవిత, ములస్తం లావణ్య, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్, రుద్రాంగి కమల, డా. శ్యామ్ సుందర్ హర్షం వెలిబుచ్చారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి సిద్ధోగంలో భాగంగా పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం గౌడ కులస్తుల సంప్రదాయ ఆచారంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, బోనాల ఊరేగింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి అంజయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్, పల్లె రాంగోపాల్ గౌడ్, పల్లె రవి గౌడ్, కోల రవి గౌడ్, తాళ్లపెల్లి విక్రమ్ గౌడ్, సాయినాథ్ గౌడ్, రంజిత్ గౌడ్, గవాస్కర్, ప్రభాకర్, గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల నాటి బాల్య స్నేహితులు కలుసుకున్నారు

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వామోధిత డార్విన్ హై స్కూల్లో 2005 06 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ



విద్యార్థులు ఆదివారం రోజున పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు కుటుంబ విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సమ్మిరెడ్డి, ప్రిన్సిపాల్ దమయంతి దంపతులను ఘనంగా సత్కరించారు. వారితోపాటు తమకు విద్య నేర్పిన గురువులు అందరికి కూడా సన్మానం చేశారు. ఇరవై ఏళ్ల తరువాత బాల్య స్నేహితులం అందరం ఒకచోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని హర్షం వ్యక్తం చేశారు.

ఆర్మీ ఫలితాల్లో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ప్రభంజనం

193 మందికి సైనిక ఉద్యోగాలుచైర్మన్ కొత్త సతీష్ రెడ్డి

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:

ఇండియన్ ఆర్మీ ఉద్యోగాల ఫలితాల్లో కరీంనగర్ ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో సరికొత్త రికార్డు సృష్టించారనీ చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి తెలిపారు.ఆదివారం రేకుర్తి ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో ప్రెస్ మీట్ నిర్వహించి ఆయన వివరాలు వెల్లడించారు...గత నెల మే 30న వెలువడిన ఫలితాలలో అకాడమీకి చెందిన 193 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో ఉద్యోగాలు సాధించినట్లు ఆయన అధికారికంగా వెల్లడించారు.విభాగాల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీలో 157 మంది, అగ్నివీర్ టెక్నికల్‌లో 17 మంది, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్‌లో 14 మంది, క్లర్క్ విభాగంలో ఒకరు విజయం సాధించారనీ పేర్కొన్నారు. అలాగే ఎయిర్‌ఫోర్స్ విభాగంలో నలుగురు విద్యార్థులు (జే శన్ముఖ్ సాయి రాజ్, ఎ చరణ్ తేజ్, ఎస్ శిజ, పి మధుమిత) ఉద్యోగాలు సాధించి అకాడమీ కీర్తిని చాటారనీ తెలిపారు.మారుతున్న ఆర్మీ ఎంపిక విధానాలు, కఠినమైన ప్రశ్నల సరళిని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో లోపాలను గుర్తించి, వాటిని సవరించేందుకు నిరంతరం గ్రాండ్ టెస్టులు నిర్వహించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యపడ్డాయన్నారు. రాత పరీక్షలతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి అకాడమీలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగాల కలలను నిజం చేసుకోవాలి:

ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండి, దాని కోసం నిరంతరం తపస్సులా కృషి చేయాలని సతీష్ రెడ్డి ఆకాంక్షించారు. ఇంతటి భారీ విజయానికి సహకరించిన అధ్యాపక బృందానికి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యున్నత బోధనా ప్రమాణాలు అందిస్తున్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో చేరి, నిరుద్యోగ యువత సైనిక ఉద్యోగాల కలలను నిజం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విజయోత్సవ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు,వారి తల్లిదండ్రులు, అకాడమీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.



ఆర్మీ ఉద్యోగాలకు సాన్వి డిఫెన్స్ విద్యార్థులు ఎంపిక

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:

కరీంనగర్ లోని రేకుర్తి సాన్వి డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకుని ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామకాల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్



సన్మానించారు..ఈ సందర్భంగా మునిందర్ మాట్లాడుతూ గత ఫిబ్రవరి లో వరంగల్ లో జరిగిన ఆర్మీ ఓపెన్ ర్యాలీలో పాల్గొని మే31న ప్రకటించిన ఫలితాల్లో సాన్వి డిఫెన్స్ అకాడమీ విద్యాసంస్థల నుండి ఆర్మీ వివిధ ట్రేడ్ లలో మొత్తం 56మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని తెలియజేసారు.కళాశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఇంటర్మీడియట్లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు, ఎంసెట్, ఐఐటీ పోటీ పరీక్షల్లోకూడా మంచి ర్యాంక్ లు సాధించారని తెలిపారు. పెద్ద మొత్తంలో డిఫెన్స్ ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అన్నారు.. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు..

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఛలో హైదరాబాద్ కు కాంట్రాక్టర్ల పిలుపు

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్లు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఖిఛలో



హైదరాబాద్ మహాసభఖిను విజయవంతం చేయాలని కోరుతూ కరీం నగర్‌లో సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు.దీంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పనులు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో కుటుంబాలు సంక్షోభంలో ఉన్నాయని పేర్కొన్నారు.ముందు వచ్చిన బిల్లులకు ముందు చెల్లింపులు జరపాలన్న నిబంధనను ప్రభుత్వం అమలు చేయాలని పేర్కొన్నారు. ఎటువంటి సిఫార్సులు, వివక్ష లేకుండా సీనియారిటీ ప్రాతిపదికన బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉపసంఘానికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వేముల సత్యమూర్తి, సుగుణాకర్ రావు, కటుకూరి దేవేందర్ రెడ్డి,బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

ధాన కార్యదర్శి నీ ..... సన్మానించిన విశ్వకర్మ సంఘం .

వీణ వంక,ప్రభాత వార్త:

వీణవంక మండలము కిష్టం పేట గ్రామానికి చెందిన వావినీల సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున ఆదివారం ఆయనను ఆయన స్వగృహంలో విశ్వ కర్మ సంఘం రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఉదారపు నరసింహ చారి,మండల సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రామూర్తి తో పాటు మండల నేతలు శాలువాతో ఘనంగా సన్మానించారు.



బాలల హక్కులు, నాయకత్వ వికాసానికి 'బాల పంచాయత్'

గ్రామాభివృద్ధిలో పిల్లలను భాగస్వాములను చేయడమే లక్ష్యం

పాఠశాలలు, కళాశాలల్లో 'స్నేహిత' సీక్రెట్ బాక్సులు ఎమ్మెల్యే డాక్టర్

కవ్వంపల్లి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

మానకొండూర్, ప్రభాతవార్త :

గ్రామాభివృద్ధిలో పిల్లల్ని భాగస్వాములు చేయడమే లక్ష్యమని టిపిసిసి ఎస్సీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర డాక్టర్ సెల్ అడ్వైజర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్, కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్ పార్లమెంట్, బాల పంచాయత్ అవగాహన సదస్సు జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం పాల్గొన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు, వారిలో నాయకత్వ వికాసానికి 'బాల పంచాయత్' ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఈ కార్యక్రమానికి పైలెట్ ప్రాజెక్టుగా మానకొండూరు మండలాన్ని ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. పిల్లలు తమ గ్రామం, పాఠశాల, కుటుంబం, సమాజానికి సంబంధించిన సమస్యలను స్వయంగా గుర్తించి, చర్చించి పరిష్కారాలను వెతకడం అభినందనీయమని,ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందిస్తుంది. ఆరోగ్యం, విద్య, బాలల రక్షణ వంటి కీలక అంశాలపై పిల్లలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలల రక్షణకు కరీంనగర్ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో బాలికలను రక్షించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని. ఇందులో భాగంగానే కరీంనగర్‌లో 'స్నేహిత' అనే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా 'సీక్రెట్ బాక్స్' లను ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు.

విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా, వేధింపులనైనా ఈ సీక్రెట్ బాక్సుల ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఈ బాక్సులకు తాళాలు వేసి ఉంచుతామని, వాటి తాళంచెవులు పూర్తిగా మహిళా కానిస్టేబుళ్ల ఆధీనంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. దీనివల్ల బాలికలకు పూర్తి రక్షణ లభిస్తుందన్నారు.

మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులు ఎదురైనా అధైర్యం చెందకుండా తక్షణమే షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలన్నారు బాధితులు నేరుగా కాకుండా మొబైల్ నంబర్ 8712670759 ద్వారా కూడా వాట్సాప్ లేదా కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను సంపూర్ణంగా గోప్యంగా ఉంచుతామని . మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ సిన్హా ఐపీఎస్ పిలుపు మేరకు బాలలను చైతన్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ బాల పంచాయత్‌లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పర్విన్, ఏసీపీ విజయకుమార్, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిని శేఖర్ గౌడ్, ఎంపీడీవో వివి వరలక్ష్మి, ఎంఈఓ రాపల్లి శ్రీనివాస్, మానకొండూరు మండల సర్పంచ్ల పోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు, మండల సర్పంచులు బుర్ర శ్రీధర్ గౌడ్, పాడల సత్యనారాయణ గౌడ్, పర్నంది కేశవ్, డాక్టర్ సల్మాన్, శ్రీనివాస్, మానకొండూర్, తిమ్మాపూర్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐలు శ్రీలత, బొల్లం రమేష్ యాదవ్, పుల్లయ్య, ఎస్సై తిరుపతి, షీ టీమ్స్, విద్యార్థులు, వివిధ గ్రామాల మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీంపల్లి గ్రామీణ వైద్యుడు వడదెబ్బతో మృతి -

కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి

కమలాపూర్: ప్రభాత వార్త.

భీంపల్లి గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బండారి చంద్రమోళి (48) శుక్రవారం వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హుజరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం చంద్రమోళి మృతి చెందారు. కుటుంబానికి పెద్దదిక్కైన ఆయన మరణంతో ఆ ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రమోళి దీర్ఘకాలంగా గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అందరి అభిమానం పొందారు. ఆయన మరణం పట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని, తగిన సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్పొరేట్ సంస్థలకు కట్టుబడే విధానాలను వ్యతిరేకిద్దాం..

రైతు సంఘం జిల్లా నాయకులు.

.జమ్మికుంట / హుజూరాబాద్, ప్రభాతవార్త:

దేశ ఆహార భద్రతను పరిరక్షి ద్వాం ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు వ్యతిరేకిద్దాం నీదిని కాపాడుదామని ఆదివారం కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చెల్వూరి రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆహార భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (నీడి)ని బలహీనపరిచే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించడంలో ఎఫ్.సి.ఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు రైతులకు, పేదలకు, దేశ ఆహార భద్రతకు తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్లకు అప్పగించే విధానాలను ప్రజలు, రైతులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎఫ్.సి.ఐని పరిరక్షి ంచడం అత్యవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి, రైతులు మరియు సాధారణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని డిమాండ్ చేశారు



ధాన కార్యదర్శి నీ .....
సన్మానించిన విశ్వకర్మ సంఘం .

వీణ వంక,ప్రభాత వార్త:

వీణవంక మండలము కిష్టం పేట గ్రామానికి చెందిన వావినీల సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున ఆదివారం ఆయనను ఆయన స్వగృహంలో విశ్వ కర్మ సంఘం రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఉదారపు నరసింహ చారి,మండల సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రామూర్తి తో పాటు మండల



ఓటరు నమోదు, పార్టీ బలోపేతమే లక్ష్యం

-- మాజీ ఎంపి వినోద్ కుమార్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రజలందరికి ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత మనదని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు, బిఎల్ఏ విధులపై అవగాహనపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో కలసి బిఆర్ఎస్ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి వినోద్ కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఓటర్ల లిస్టు సవరణ కార్యక్రమంలో భాగంగా నిజమైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడవలసిన బాధ్యత బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల పై ఉందన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, నిజమైన ఓటర్ల ను బిఎల్ఏలు నమోదు చేసే విధంగా చూడాలని అన్నారు. మృతి చెందిన వారి ఓటర్ల పేర్లను మాత్రమే తొలగించేలా చూసుకునే బాధ్యత మనందరి పై ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ పై ఓటర్ నమోదు కార్యక్రమం పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

-- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి...

-- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...

పార్టీ ఆదేశానుసారం హుజూరాబాద్ నియోజకవర్గంలో నూతన సభ్యత్వాలను చేర్పించడం ద్వారా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలకు మరింత వివరించాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత అది మరిచిపోయిన విషయాలపై ప్రజలకు గుర్తు చేయాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి అడ్డగోలు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన నయవంచన పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రచారం చేయాలన్నారు. గతంలో మాదిరిగా హుజూరాబాద్ నియోజకవర్గంలో గులాబీ సేన మరింత పటిష్టంగా ఉండాలని అన్నారు. సభ్యత్వ నమోదు పూర్తయిన తర్వాత త్వరలోనే పార్టీ సంస్థగత నిర్మాణం జరుగుతుందని అన్నారు. సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు కార్యక్రమాల పై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈనెల 12న జమ్మికుంట పట్టణంలోని ఎంపిఆర్ గార్డెన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పరిపాటి రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ దిలీప్ కుమార్, పింగిలి రమేష్, ముసిపట్ల తిరుపతి రెడ్డి, కన్నూరు సత్యనారాయణ రావు, ఎడవెల్లి కొండల్ రెడ్డి, వద్దినేని రవీందర్ రావు, కట్కూరి మల్లారెడ్డి, ఇరుమళ్ళ సురేందర్ రెడ్డి, సంఘం ఐలయ్య, గందే శ్రీనివాస్, మాడ సాదవ రెడ్డి, రంజిత్, వెంకటేష్, బాల బాలకిషన్ రావ్, తిరుమల్ రెడ్డి, ముత్యం రాజు పాల్గొన్నారు.





పాఠశాలల కుదింపుపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి..

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డీటీఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వినర్ పల్కల ఈశ్వర్ రెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొస్తే ఒక్క పాఠశాలను కూడా మూసివేయనని,



బడ్జెట్ లో విద్యారంగానికి 15!! నిధులు కేటాయిస్తామనీ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రైవేటు విద్యారంగాన్ని, ఫీజులను నియంత్రిస్తామని, ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ఈ తిరోగమన విధానాన్ని ప్రకటించడం సరికాదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను సమగ్రంగా అధ్యయనం చేయకుండా, ఇలా పాఠశాలలను మూసి వేసుకుంటూ వెళ్తే త్వరలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా కనుమరుగై, విద్యారంగ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. దీని ద్వారా పేద విద్యార్థులకు విద్య అంద కుండా పోయే అవకాశం ఉందన్నారు. ఈ చర్య ద్వారా సామాజిక, ఆర్థిక సమానతలు మరింత పెరిగిపోతాయి అన్నారు. ఈ కుదింపు ప్రక్రియ అంతా ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా చేపట్టే విధానాలే అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, విద్యారంగ సమస్యలు పరిష్కరించి, ప్రతి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి, సరైన పర్యవేక్షణ, సరైన మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఈశ్వర్ రెడ్డి కోరారు. లేనిచో పాఠశాలల రేషనలైజేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల కుదింపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యువత క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకోవాలి.....

చెడలవాట్లకు దూరంగా ఉండాలి....ఎస్సై.

వీణవంక, ప్రభాత వార్త:

యువత చెడలవాట్లకు దూరంగా ఉండి,క్రీడలపట్ల ఆసక్తిని పెంచుకోవాలనీ స్థానిక ఎస్సై ఆవుల తిరుపతి అన్నారు. వీణవంక మండల కేంద్రంలో గత 20 రోజుల నుండి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో 25 జట్లు పాల్గొనగా శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామ టీం విజేతగా నిలువగా,వీనవంక బృందం రన్నర్ గా నిలిచింది. ఈ సందర్భంగా బహుమతుల ప్రధానానికి ఎస్సై, కమర్షియల్ టాక్స్ అధికారి ఓరం విజయాకుమార్,మాజీ వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్ లు హాజరై ప్రైజ్ పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలు, బెట్టింగ్,సెల్ ఫోన్ లకు అలవా టు పడకుండా,ఏదో క్రీడను ఎన్నుకొని అందులో వారి వారి నైపుణ్యాన్ని ప్రదర్శించి గ్రామ ఖ్యాతి నిలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భానుచందర్,వార్డు సభ్యులు భోగం అనిల్,నీల శ్రీకాంత్ తో పాటు క్రీడా కారులు ,గ్రామస్థులు పాల్గొన్నారు.



తెలంగాణ చరిత్రను తెలంగాణ ప్రజలే నిర్మించేలా దొడ్డి కొమరయ్య సినిమా

సినిమా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు డొంకెన రవీందర్

తొలి అమరుడి చిత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణలో వెల్లడి

పెద్దపల్లి, ప్రభాతవార్త:

తెలంగాణ చరిత్రను తెలంగాణ ప్రజలే నిర్మించేలా దొడ్డి కొమరయ్య సినిమా రూపుదిద్దుకుంటోందని సినిమా నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు డొంకెన రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర పెద్దపల్లి జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం కళాకారుల ఆటపాటలతో ర్యాలీగా ముందుకు సాగి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ర్యాలీగా బయలుదేరి నందన గార్డెన్ కి చేరుకొని పెద్దపల్లి జిల్లా నుండి దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణంలోకి సహనిర్మాతలుగా వచ్చిన 26 మందికి ప్రశంస పత్రాన్ని అందించి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం అఅవఎ్చ నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు డొంకెన రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను తెలంగాణ ప్రజలే నిర్మించేలా



సేనాపతి 1000 మంది సహ నిర్మాతలతో దొడ్డి కొమరయ్య సినిమా తీయాలి అనుకున్న నిర్ణయం చాలా గొప్పది అని అన్నారు. జిల్లా చైర్మన్ బత్తుల శంకర్ మాట్లాడుతూ ఇప్పటికైనా తెలంగాణ వీరుల చరిత్రలు బయటికి రావాలి అని అన్నారు. చిత్ర దర్శకుడు ఎన్ సేనాపతి మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య సినిమా తీయడం తన అదృష్టంగా భావిస్తున్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా సహనిర్మాతలు పొట్యాల మల్లేశం, ఆకుల స్వామి వివేక్ పటేల్, ఆరెల్లి మల్లేష్, కుమారస్వామి, నూనె రాజేశం, కటకం కమలాకర్ పటేల్, దుంప నరసయ్య, జనగామ రవి, రంగం దశరథం, దాసరి రామస్వామి, మొలుగు నరేష్, గాజుల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ప్రమాదానికి గురైన యువతి కుటుంబానికి పెరిక సంఘం అండ

బాధితురాలి తండ్రి లగిశెట్టి శ్రీనివాస్‌ను పరామర్శించిన

పెరిక సంఘం నాయకులు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సిరికే క్వార్టర్స్, నస్పూర్ ప్రాంతానికి చెందిన యువతి కుటుంబానికి పెరిక సంఘం నాయకులు అండగా నిలిచారు. యువతి తండ్రి లగిశెట్టి శ్రీనివాస్ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు దుండే మల్లేష్, మాజీ ఎంపీపీ కందుల పోశం, పెరిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు లగిశెట్టి చంద్రమోళి, గుడిపేట పెరిక సంఘం అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, తిప్పని రాజలింగు, ఎంబడి సమ్మయ్య,రవి,సతీష్ నల్లపు తిరుపతి తదితరులు బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి సంబంధించిన వివరాలను లగిశెట్టి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స పొందుతున్న యువతి ఆరోగ్య పరిస్థితిపై అక్కడ ఉన్న వారితో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, పెరిక సంఘం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని నాయకులు భరోసా కల్పించారు. ప్రమాదం కారణంగా చికిత్స ఖర్చులు భారీగా పెరిగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, అవసరమైతే కుటుంబ సభ్యులు అమెరికాకు వెళ్లేందుకు కావాల్సిన సహకారం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయి నాయకుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. యువతి త్వరగా కోలుకుని క్షేమంగా స్వదేశానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ప్రమాద బాధిత కుటుంబానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంస్థలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని పెరిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంఘం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.

కుమ్మర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వినతి

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

కుమ్మర కుల వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను కోరారు. ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్ రావు ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.కుమ్మర ఆత్మభవన్ ట్రస్ట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు కేటాయించాలని, కుమ్మర వృత్తి అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే చెరువులు, కుంటల నుంచి వృత్తి అవసరాల కోసం మట్టిని తీసుకునేందుకు సంబంధించిన జీవోను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఏడాది నిర్వహించే లోయర్ ట్యాంక్‌బండ్ కనకాలకట్ట మైసమ్మ దేవాలయం బోనాల జాతర నిర్వహణకు సహకరించాలని, ఈ జాతరకు హాజరుకావాలని మంత్రిని ఆహ్వానించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా



స్పందిస్తుందని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, ప్రధాన కార్యదర్శి మల్యాజ్గిరి దయానంద్, కోశాధికారి ఆమంచి రాజలింగం, అసోసియేట్ అధ్యక్షుడు కే. లక్ష్మీనారాయణ, టి.కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రామన్‌కోల్ వీరేశం, వృత్తి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల గోవర్ధన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మంపటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో సందడి

ఓదెల ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది ఆదివారం జాతర దినం కావడంతో ఇతర రాష్ట్రాల నుండి అలాగే పలు జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది వచ్చిన భక్తులు స్వామివారికి అభిషేకాలు పట్నాలు బోనాలు పుట్టు వెంట్రుకలు కోడెను కట్టుట తోపాటు ఇతర మొక్కులను చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేసినారు ఓదెల శ్రీ మల్లికార్జున స్వామిని కోరుకోగానే కొంగు బంగారం చేసే దేవుడు ఓదెల మల్లికార్జున స్వామి ఆని భక్తుల నమ్మకం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ ఈవో సదయ్య ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



పెద్దపల్లి వార్త

బదిలీపై వెళ్తున్న ఎస్సై సనత్ కుమార్ రెడ్డికి ఘన సన్మానం

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన ఎస్సై సిహెచ్. సనత్ కుమార్ రెడ్డి ఇటీవల పోత్కపల్లి పోలీస్ స్టేషన్ కు బదిలీ అవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మానుమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జూలపల్లి మండలంలో విశిష్ట సేవలందించి ప్రజల మన్ననలు పొందిన మన జూలపల్లి ఎస్సై బదిలీ పై వెళ్లడం చాలా బాధాకరమని అన్నారు.జూలపల్లి మండల నాయకులు ఎస్సై సనత్ కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కోరేపు సంపత్,మల్లెత్తుల సంతోష్,దాడి కుమార్ యాదవ్,అమరగాని సాయి,నెరువట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి

గోదావరిఖని ,ప్రభాతవార్త:







సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం భూపాలపల్లిలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అఖిల భారత బొగ్గు గనుల విభాగం ఇన్‌చార్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లాల శ్రీనివాస్ వ్యవహరించారు. సమావేశంలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన కమిటీలో అధ్యక్షుడిగా అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యాదగిరి సత్తయ్య, కోశాధికారి గా సాయి వేణి సతీష్ ఎన్నికయ్యారు. ఇతర పదవులకు కూడా సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంస్థ అభివృద్ధికి కూడా సహకరిస్తామని పేర్కొన్నారు.సమావేశంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్మికులు, నాయకులకు రాష్ట్ర కమిటీ తరఫున నూతన ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా వాలీబాల్ విభాగం అధ్యక్షురాలిగా ఎర్రం అనిత



సుల్తాబాద్, ప్రభాతవార్త: పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎర్రం అనితను నియమించినట్లు అసోసియేషన్ నాయకులు శనివారం తెలిపారు. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్ వాసు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి తిరుమలరావు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. మహిళా వాలీబాల్ క్రీడాకారిణుల ప్రోత్సాహం, క్రీడాభివృద్ధికి ఎర్రం అనిత సేవలు ఉపయోగపడతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ నాయకత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మహిళా వాలీబాల్ క్రీడాకారిణులను ప్రోత్సహిస్తూ క్రీడా రంగ అభివృద్ధికి కృషి చేస్తానని ఎర్రం అనిత పేర్కొన్నారు. మహిళలకు క్రీడల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వాహన పార్కింగ్ కేంద్రాలుగా మారిన బస్సు షెల్టర్లు

నిలువ నీడ లేక ప్రయాణికుల అవస్థలు

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

మల్యాల/ ప్రభాతవార్త



కరీంనగర్ జగిత్యాల ప్రధాన మార్గంలోని మల్యాల క్రాస్ రోడ్డు వద్ద ప్రతి నిత్యం వందలాదిమంది ప్రయాణికులు రాకపోకలతో సందడిగా ఉంటుంది, మల్యాల తో పాటు పెగడపల్లి మండల ప్రయాణికులు ఇక్కడ నుండి ఇతర ప్రదేశాలకు బస్సు ప్రయాణం చేస్తారు, ఇక్కడ ప్రయాణికుల సౌకర్యం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తెలుగు గ్రామీణ క్రాంతి పథకం లో నిర్మించిన బస్సు షెల్టర్ ఆర్టీసీ అధికారుల నిరక్ష్యాన్నికి అద్దం పడుతోంది, ప్రయాణికులు ఉండాల్సిన బస్ షెల్టర్ లో ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారడంతో ఇక్కడ ప్రయాణికులకు నిలువ నీడ లేక ఎండలోనే బస్సుల కోసం పడి కాపులు కాస్తున్నారు, ఇటీవల మల్యాల పోలీసులు దీనవస్థకు చేరిన బస్సు షెల్టర్ వద్ద మొరం తో చదును చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చినప్పటికీ అందులో వాహనాలు నిలపడం వల్ల ప్రయాణికులు రోడ్డుపైనే నిల్చుంటున్నారు, అంతేకాకుండా మల్యాల అంగడి బజార్ సమీపంలో లక్షలు వ్యయంతో నిర్మించిన బస్టాండ్ కూడా ఆర్టీసీ అధికారులు నిరక్ష్యం వల్ల నిరుపయోగంగా మారింది, దీంతో ప్రయాణికులు బస్సులతో కళకళలాడాల్సిన బస్టాండ్ వాహనాల పార్కింగ్ కు ఉపయోగపడుతుంది, ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్లను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు, కొత్తగా నిర్మించారు ఉన్నవాటిని వినియోగించరు అనే చందంలా అధికారుల తీరు మారిందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు, అధికారులు చర్యలు తీసుకుని బస్సులు నిలిపి ప్రయాణికులకు బస్ షెల్టర్ వినియోగం లోకి తీసుకురావాలని కోరుతున్నారు,

జన గణన కొనసాగుతుంది గ్రామాల ప్రజలు నమోదు చేసుకోవాలి

కొండగట్టు ఉత్తవ కమిటి చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి

చొప్పదండి,ప్రభాతవార్త:



ప్రతి గ్రామంలో జన గణన కొనసాగుతుంది గ్రామాల ప్రజలు నమోదు కాకపోయి ఉంటే తప్పనిసరిగా జన గణన లో నమోదు చేసుకోవాలని చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం చొప్పదండి లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా గణన కార్యక్రమంలో ఏదైనా ఇల్లు జనాభా గణన లో నమోదు ఏకాకపోయి ఉంటే, మీ ఇంటికి గణన సిబ్బంది రాకపోయి ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి కి పంచాయతీ కార్యాలయం లో తెలియజేయాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. జనాభా గణన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి ప్రజల సహకారం తప్పని సరిగా అవసరం అన్నారు.

ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

చొప్పదండి,ప్రభాతవార్త:

చొప్పదండి పట్టణంలో తెలంగాణ తల్లికి పూలమాల వేసి తెలంగాణ రక్షణ సేన జెండా పండగ కార్యక్రమాన్ని ఆదివారం చొప్పదండి నియోజకవర్గ ఇన్చార్జ్ మ్యాకల తిరుపతి ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ జెండా పండుగ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చొప్పదండి నియోజకవర్గం ప్రజలు తెలంగాణ రక్షణ సేన నాయకులు పాల్గొని జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ మట్లాడుతూ చొప్పదండి మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జంక్షన్ లో భాగంగా ఎన్టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసే జంక్షన్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చేంతవరకు నిరంతరం ప్రజల సమస్యల పైన పోరాటం చేస్తూ ప్రజలకు పాంచజన్య సామాజిక ఉచిత విద్య, ఉచిత వైద్యం ఇటువంటి అనేక అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి తెలంగాణ రక్షణ సేన చోప్పదండి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలం ముందుంటామని తెలిపారు . ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ నాయకులు గుండేటి తిరుపతి, ఏనుగు మల్లా రెడ్డి, పిట్టల సత్యం, రాముల రమేష్, కుతాడి శ్రీనివాస్,వెంకటేష్,రత్నాకరచారి, లింగంపల్లి శ్రీనివాస్, తిరుపతి, చంటి శ్రీనివాస్, ఎం డి రాజీ, పవన్, బషీర్, కైపు, చందు, అంజలి, అపర్ణ, అలేఖ్య తో పాటు పలువురు పాల్గొన్నారు.



నూర్ భాషా దూదేకుల సంఘం అధ్యక్షులుగా సలీం

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలంలోని రామన్నపేట, పోతారం, మద్దుట్ల గ్రామాల నూర్ భాషా దూదేకుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం గౌరవ అధ్యక్షులు వలి మహ్మద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, అధ్యక్షులుగా మహమ్మద్ సలీం, ఉపాధ్యక్షులు హారిఫ్, ప్రధాన కార్యదర్శిగా రఫీ, కోశాధికారి గా బాష్ భాయ్, సలహాదారులుగా సాహెబ్ హుస్సేన్, అజారుద్దీన్, కార్యవర్గ సభ్యులు గా రషీద్, అబ్దుల్లా, రంజాన్ ,సలీం, అబ్దుల్ ఎన్నికైనట్లు అజారుద్దీన్ తెలిపారు,

వ్యాపారం దివాళా తీసి ఆత్మహత్య

చొప్పదండి,ప్రభాతవార్త:



మండల పరిధిలోని చాకుంట గ్రామానికి చెందిన ముద్దం రాజనర్సయ్య(62) గతంలో డైరీ ఫార్మ్ పెట్టి నష్ట పోవడం తో పాటు తనకున్న వ్యవసాయ భూమి అమ్ముకోవడం జరిగిందని చొప్పదండి పోలీసులు తెలిపారు. మనస్తాపానికి గురై శనివారం గడ్డి మందు త్రాగటం తో కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించి నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్దుటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మల్యాల/ ప్రభాతవార్త



మండలంలోని మద్దుట్ల గ్రామంలో ఆదివారం జగిత్యాల కు చెందిన ఓం శ్రీ నేత్రాలయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా కంటి వైద్యాన్ని పునుగులు మృదుల రెడ్డి రోగులను పరీక్షి చి మందులను పంపిణీ చేశారు, గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా వైద్యురాలని సర్పంచ్ సంకుర్తి తిరుపతి ఆధ్వర్యంలో సన్మానించారు, గ్రామ సర్పంచ్ తిరుపతి తోపాటు, ఉప సర్పంచ్ రాజు, మాజీ ఎంపిటిసి రవి, బొమ్మన పరమేశ్వర్, నరేష్ ,గణేష్ తో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు

చొప్పదండి వార్త

కొండగట్టు అంజన్న దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

మల్యాల /ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థాన కు ఆదివారం అదిలాబాద్ ఎమ్మెల్యే సాయిల్ శంకర్ కుటుంబ సమేతంగా వచ్చి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు, ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికిన అనంతరం శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన తన మొక్కులు చెల్లించుకున్నారు, కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్, ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ ఉప ప్రధానార్చకులు చిన్న రాము పాల్గొన్నారు,

రామన్నపేట ముస్లిం కమిటీ అధ్యక్షులుగా అలీముద్దీన్

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలం రామన్నపేట లో ఆదివారం మక్కా మసీదు ఐదు గ్రామాల ముస్లిం కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, ఈ సందర్భంగా రామన్నపేటలో గత 40 ఏళ్లుగా కమిటీ అధ్యక్షుడుగా కొనసాగుతున్న ఆలీముద్దీన్ ను తిరిగి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఉపాధ్యక్షులుగా అజీముద్దీన్, అజారుద్దీన్, జనరల్ సెక్రెటరీ గా రియా జుద్దిన్, అడ్వైజర్ గా మహమ్మద్ అలా ఉద్దీన్, కోశాధికారిగా రఫీ, జనరల్ సెక్రెటరీగా సలీం ,బద్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు గా, ఫరీద్ ఖాన్, రఫీ, అమీనుద్దీన్, సాజిద్ లను ఎన్నుకున్నట్లు అడ్వైజర్ ఎండీ అలావుద్దీన్ తెలిపారు,

విద్యతో పాటు సృజనాత్మక క్రీడలు సైతం సమగ్ర వికాసానికి అవసరం

చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్

చొప్పదండి,ప్రభాతవార్త:



విద్యార్థులకు విద్యతో పాటు సృజనాత్మక, క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరం అని చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణం లోని చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాల లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు, కరాటే ప్రదర్శనలతో వారి వారి ప్రతిభ ను ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందేలా ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. హ్యాపీ సండే కార్యక్రమం ఎంతో అలరించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, కమిషనర్ కీర్తి నాగరాజు, కౌన్సిలర్ లు కొట్టె సునీత అశోక్, కనుమల్ల రాజశేఖర్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, పిట్టల వెంకటేష్, ముద్దం రాజేశ్వరి తిరుపతి, శ్రీగాద సంతోష్, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్ని సార్లు విన్నవించినా మారని అధికారుల తీరు

-వర్షంలో నానిన రైతన్న కష్టం!

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఆదివారం కురిసిన భారీ వర్షం రైతుల కష్టార్జిత పంటను నీటిపాలు చేసింది. కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం వర్షపు నీటిలో తడిసిముద్దవగా, రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చే అవకాశాలపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అదనపు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, ధాన్యాన్ని భద్రమైన ప్రదేశాలకు తరలించాలని రైతులు పలుమార్లు అధికారులను కోరినా వారి తీరు మాత్రం మారలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఎదురవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.ఆదివారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రం ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోగా, ధాన్యం కుప్పలు వర్షపు నీటిలో నానిపోయాయి. ధాన్యం నాణ్యత దెబ్బతింటుందనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. “వర్షం పడకముందు ఎన్నిసార్లు చెప్పినా వినలేదు.. ఇప్పుడు ధాన్యం తడిసిపోయాక వచ్చి పరిశీలిస్తే ఉపయోగం ఏమిటి?“ అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.నెలల తరబడి శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే అక్కడ సరైన సౌకర్యాలు లేక నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో కూడా స్పష్టత లేకపోవడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది.“ప్రకృతి విపత్తులతో పోరాడి పంటను కాపాడుకుంటే, అధికారుల నిరక్ష ్యం వల్ల నష్టం జరుగుతోంది. ఎన్ని సార్లు వివరించినా, ఎన్ని సార్లు విజ్ఞప్తి



చేసినా అధికారుల తీరు మారడం లేదు. రైతుల కష్టాలు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు“ అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని, నిరక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.రైతులు పలుమార్లు సమస్యను మార్కెట్ కమిటీ యాజమాన్యం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నా, ధాన్యం నీటిలో నానిపోతున్నా మార్కెట్ కమిటీ అధికారులు క్షేత్రస్థాయిలోకి వచ్చి పరిస్థితిని పరిశీలించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని రక్షించేందుకు అత్యవసర చర్యలు తీసుకోవాల్సిన సమయంలో మార్కెట్ కమిటీ యాజమాన్యం నిరక్ష్యంగా వ్యవహరించిందని మండిపడుతున్నారు. “ధాన్యం పూర్తిగా దెబ్బతిన్న తర్వాత వచ్చి చూసినా మాకు ఉపయోగం లేదు.. ముందస్తుగా చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు“ అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతరాలు లేని,వర్గ రహిత సమ సమాజ నిర్మాణమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

వేములవాడలో ముగిసిన సిపిఐ రాజకీయ శిక్షణా శిబిరం

వేములవాడ టౌన్ ప్రభాతవార్త:



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెనుభారం మోపుతుందని,విచ్చల విడిగా వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుందని ధరల పెరుగుదలను నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరగనున్నాయని వాటిని విజయవంతం చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి అన్నారువేములవాడలో గత మూడు రోజులుగా జరుగుతున్న



ఉమ్మడి కరీంనగర్ జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరాలు నేటితో ముగిశాయి.ఈ కార్యక్రమానికి హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు,గ్యాస్ ధరలు పెరగడం వల్ల ప్రజల జీవనప్రమాణాలపై ఆ ప్రభావం పడుతుందని,బీజేపీ నేతలు పదేపదే చెప్పే అచ్చేదిన్ కాదు ప్రభుత్వ నిర్వాకం మూలంగా ప్రజలకు సచ్చేదిన్ వస్తుందన్నారు.కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్నుల రాయితీలు ఇస్తూ వారికి కొమ్ముకస్తుందన్నారు.ఈ నేపధ్యంలో అన్ని జిల్లాలలో జరిగే నిరసన ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్,ఆయా జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్,తాండ్ర సదానందం, మంద సుదర్శన్,చెన్న విశ్వనాథం,వేములవాడ నియోజక వర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,గోషిక మోహన్ తదితరులు పాల్గొన్నారు

చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

100 మంది చిన్నారులకు వైద్య సేవలు

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో వేములవాడ సింధు పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నీలోఫర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణురాలు డాక్టర్ సింధు (ఎండీ పీడియాట్రిక్స్) పాల్గొని సుమారు 100 మంది చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి అవసరమైన మందులు, టానిక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, సమయానికి వ్యాక్సినేషన్ చేయించుకోవాల్సిన అవసరం, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామీణ



ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ సింధు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని చెక్కపల్లి సర్పంచ్ అడ్డిక లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కాదాసు అనిల్ ప్రారంభించారు. గ్రామ ప్రజల ఆహ్వానాన్ని మన్నించి చెక్కపల్లి గ్రామానికి వచ్చి చిన్నారులకు ఉచిత వైద్య సేవలు అందించిన డాక్టర్ సింధుకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ వేములవాడ రూరల్ అధ్యక్షులు సోయినేని కరుణాకర్, హాస్పిటల్ నిర్వాహకులు పత్తిపాక శ్రీనివాస్, మల్యాల పరశురాములు, ఆముదాల కిషన్, పార్వతి అరుణ్, దూస కృష్ణ, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేములవాడ వార్త

మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

చందుర్తి / ప్రభాతవార్త:

చందుర్తి మండలంలో చందుర్తి, ఎన్గల్, ఆశీరెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం తెలిపారు, ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి కృసి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు, మిగతా గ్రామాల్లో కూడా నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకోవడం జరుగుతుందని బొజ్జ మల్లేశం తెలిపారు.

కాళోజి సాహిత్య పురస్కారానికి ఎంపికైన రాజు

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ జాతీయ కవి, బహుభాషావేత్త, రచయిత, గేయకవి, అనువాదకుడు డా. పెరుక రాజు సాహిత్య రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన ˝కాళోజి సాహిత్య పురస్కారం 2026” కు ఎంపికయ్యారు. సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డా. పెరుక రాజు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.కూలీ, రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన డా. పెరుక రాజు ప్రస్తుతం దేశ రక్షణ శాఖ ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి హోదాలో సేవలందిస్తున్నారు. జాతీయ కవిగా, గేయకవిగా, రచయితగా, అనువాదకుడిగా అనేక భారతీయ భాషల మధ్య భావాలను, సంస్కృతులను అనుసంధానిస్తూ విశేష కీర్తిని సంపాదించారు.సాహిత్యంతో పాటు సామాజిక సేవలోనూ ఆయన విశేష కృషి చేస్తున్నారు. పేద అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం˝మై గిఫ్ట్” అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవలందిస్తూ,˝ప్రోత్స హించడమే మై గిఫ్ట్” అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు.ఈ ఏడాదిలోనే డా. పెరుక రాజు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో పాటు అనేక గౌరవాలను సొంతం చేసుకున్నారు. ఆంగ్ల పత్రికల్లో రోజువారీ ఆర్టికల్స్ రాస్తూ సాహిత్య చింతనను మరింత విస్తరిస్తున్నారు.డా. పెరుక రాజు కు లభించిన ఈ గౌరవం ఆయన సాహిత్య ప్రతిభకు మాత్రమే కాకుండా జాతీయ విలువలు, సామాజిక బాధ్యత, సాంస్కృతిక సమైక్యత పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీ మిత్రులు, అభిమానులు, ˝మై గిఫ్ట్” సభ్యులు, గ్రామ ప్రజలు వివిధ రంగాల ప్రముఖులు డా. పెరుక రాజును అభినందించారు.

భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ ఈవోలు జి.శ్రావణ్ కుమార్, జి.అశోక్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేసేందుకే కార్డెన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం

-మంథని సీఐ బొల్లపల్లి రాజు

రామగిరి ప్రభాతవార్త:

సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలు అప్రమత్తం చేసేందుకు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మంథని సీఐ బొల్లపల్లి రాజు పేర్కొన్నారు. రామగిరి మండలంలోని పన్నూరు గ్రామంలో ఆదివారం ఎస్సై తాడవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గ్రామంలో తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలో 78 బైక్ లను తనిఖీ చేసి 19 నంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ క్రైం, గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తుల విషయంలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుతంగా మెలగాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. యువకులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.



గంజాయి రవాణా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరైనా భూ కబ్జాలకు, భూ సంబంధిత గొడవల్లో పాల్గొని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిందం మహేష్, ముత్తారం, మంథని ఎస్సైలు రవి కుమార్, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

అధైర్యపడవద్దు... అండగా ఉంటాం

-పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి

-లగిశెట్టి స్పందన కుటుంబాన్ని పరామర్శించిన పెరిక సంఘం నాయకులు

ముత్తారం, ప్రభాతవార్త:

అమెరికాలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్న లగిశెట్టి స్పందన కుటుంబానికి అండగా ఉంటామని పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి భరోసా కల్పించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని నాగార్జున కాలనీ నివాసముంటున్న లగిశెట్టి స్పందన తల్లిదండ్రులు లగిశెట్టి శ్రీనివాస్ సునీత దంపతులను పెరిక సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో మే 31న ప్రమాదశాత్తు మెట్రో స్టేషన్ పై భాగం 25 అడుగుల ఎత్తు నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలై కోమాలో



ఉన్న లగిశెట్టి స్పందనకు పెరిక సంఘం తరుపున అండగా నిలుస్తున్నామని, అధైర్యపడవద్దన్నారు. స్పందన త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. దాతలు ముందుకు వచ్చి స్పందన కుటుంబానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యరకమంలో పెరిక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దుండె మల్లేష్, మాజీ ఎంపీపీ కందుల పోశం, పెరిక సంఘం స్టేట్ మాజీ ఉపాధ్యక్షులు లగిశెట్టి చంద్రమోళి, గుడిపేట అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, పెరిక సంఘం నాయకులు నల్లపు తిరుపతి తదితరులున్నారు.

హుజురాబాద్‌లో ఖాకీ అవతారంలో సైబర్ కేటుగాళ్లు...

-- చాకచక్యంగా బురిడీ కొట్టించిన మహిళ...!

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ సరికొత్త పంథా ఎంచుకుంటున్నారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు గుంజేందుకు ఏకంగా పోలీసుల పేర్లనే వాడుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో తాజాగా వెలుగు చూసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే ఒక గృహిణి చూపిన సమయస్ఫూర్తి వల్ల కేటుగాళ్ల ప్లాన్ రివర్స్ అయింది. హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్డులో రమేష్ అనే వ్యక్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆయన వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లిన సమయంలో భార్య దాసరి శ్రీలత షాపులో ఉంది. ఈ క్రమంలోనే ఆమె మొబైల్‌కు ఒక అపరిచిత నంబర్ (7659896370) నుండి ఫోన్ వచ్చింది. మేము పోలీసులం మాట్లాడుతున్నాం.. సిఐ కి అర్జంటుగా డబ్బులు అవసరం ఉన్నాయి, ఒక 20 వేల రూపాయలు పంపించండి అంటూ అవతలి వ్యక్తి ఒత్తిడి తెచ్చాడు. అంతటితో ఆగకుండా మరో నంబర్ (992667482) నుండి వాట్సాప్‌లో ఒక క్యూఆర్ కోడ్‌ను పంపి, వెంటనే డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ పదే పదే ఫోన్లు చేస్తూ బెదిరింపు ధోరణి ప్రదర్శించాడు. సాధారణంగా పోలీసులు ఇలా ఫోన్ చేసి డబ్బులు అడగరనే ప్రాథమిక ఆలోచన శ్రీలతకు వచ్చింది. దీంతో ఆమె కేటుగాడు పంపిన క్యూఆర్ కోడ్‌ను నిశితంగా పరిశీలించింది. అందులో శ్రేయాన్స్ అనే పేరు కనిపించడంతో ఆమెకు గట్టి అనుమానం వచ్చింది. తక్షణమే స్పందించిన శ్రీలత, ఆ డబ్బులు పంపకుండా స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. గృహిణి అప్రమత్తతతో వ్యవహరించడంతో రూ. 20 వేల మోసం తృటిలో తప్పింది. బాధితురాలి సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సదరు ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై హుజూరాబాద్ సిఐ కరుణాకర్ స్పందిస్తూ.. సైబర్ నేరగాళ్లు రకరకాల రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారని, పోలీసుల పేరు చెప్పి డబ్బులు అడిగితే ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు, క్యూఆర్ కోడ్‌లపై క్లిక్ చేయవద్దని సూచించారు. ప్రజలు ఇలాంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే తక్షణమే స్థానిక పోలీసులను ఆశ్రయించాలని ఆయన పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల పట్టణ 39 వ వార్డులో11 లక్షల 50వేల నిధులతో పూర్తిచేసిన సిసి రోడ్ల పనులను, 49వ వార్డులో కల్వర్టు, డ్రైనేజీ పనులను స్థానిక వార్డు నాయకులుతో కలిసి పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ .ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, బండ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ బొలుసాని శ్రీనివాస్, కూతురు శేఖర్, పిట్ట ధర్మరాజు, మాజీ కౌన్సిలర్ లు బోడ్ల రాజు, పీపర్ల అనిత, కుసరి అనీల్, పంబల రాము, నాయకులు కత్రోజ్ గిరి, ఏనుగుల రాజు సిరిపురం శ్రీనివాస్, సాయి, రవి, ప్రవీణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



మంథని వార్త



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన బండి మధునమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. మృతురాలు మదునమ్మ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, మేదర బోయిన కుమార్ యాదవ్, కాపరబోయిన భాస్కర్, సల్పాల సదానందం, దామెర శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఉన్నారు.

రామగిరి హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

రామగిరి ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలో లోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ హార్టికల్చర్ (పాలిటెక్నిక్) కోర్సుల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదివారం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ప్రణీత్ కుమార్ తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కళాశాలలో ప్రవేశాలకు పాలి సెట్ 2026 లేదా ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నిర్దేశించిన నిబంధనలు, మెరిట్ ఆధారంగా ప్రవేశ ప్రక్రియ చేపడతామని తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఇతర వివరాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని వెల్లడించారు. పూర్తిగా నింపిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాల ప్రతులతో కలిసి చివరి తేదీ జూలై 5, 2026 సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలనిసూచించారు. దరఖాస్తులను శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ, ములుగు రోడ్, సిద్దిపేట జిల్లా - 502279, తెలంగాణ చిరునామాకు పంపాలని తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, అలాగే 94926 50276 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి కోఆర్డినేటర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన పీసీసీ కో ఆర్డినేటర్, జగిత్యాల నియోజకవర్గం సర్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ దర్శనం. వినోద్ కుమార్ సార్ ప్రోగ్రాం ద్వారా చేపట్టబోవు కార్యక్రమం ను వివరించారు.ఈ కార్యక్రమం లో డీసీసీ అధ్యక్షులు గాజెంగి. నందయ్య పీసీసీ సభ్యులు నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, సీనియర్ నాయకులు దామోదర్ రావు, సమిండ్ల.శ్రీనివాస్, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మస్సూర్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ కన్నా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పోచమ్మ తల్లి ఎదురు బోనాలు

ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, ప్రభాతవార్త :





గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పోచమ్మ తల్లి ఎదురు బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో, అన్ని కుల సంఘాల సహకారంతో గ్రామస్తులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.డప్పు చప్పుళ్లు, డీజే పాటల నడుమ మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. యువతీ యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేయగా, పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బైండ్ల పూజారుల ప్రత్యేక విన్యాసాల మధ్య భక్తులు పోచమ్మ ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకుంటూ మేకలను బలిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, కుల సంఘాల ప్రతినిధులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రికి తీర్థప్రసాదం అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, ఉపసర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి, వార్డు సభ్యులు, కుల సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గొల్లపల్లి, ప్రభాతవార్త :



గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1996-97 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో జరిగిన మధుర సంఘటనలను పరస్పరం పంచుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శాలువాలు కప్పి సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, వారి మార్గదర్శకత్వమే తమ జీవితాల్లో ఎదుగుదలకు కారణమైందని పేర్కొన్నారు.ఎంతో కాలం తర్వాత అందరూ ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని సందడి చేశారు.

గాలివానకు ఇల్లు కూలి కుటుంబం నిరాశ్రయం

గొల్లపల్లి, ప్రభాతవార్త:



ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా వీచిన ఈదురుగాలులు, వర్షానికి గొల్లపల్లి మండలంలోని తిరుమలాపూర్ (పీడీ) గ్రామంలో ఓ ఇల్లు పూర్తిగా కూలిపోయింది.గ్రామానికి చెందిన కళ్యెం రవికి చెందిన నివాస గృహం గాలివాన తీవ్రతకు దెబ్బతిని పూర్తిగా నేలమట్టమైంది. ఇంటి పైభాగంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు ఈదురుగాలులకు చెల్లాచెదురుగా ఎగిరిపడింది. అనంతరం కురిసిన వర్షంతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, ధాన్యం, దుస్తులు మరియు ఇతర సామాన్లు పూర్తిగా తడిసి నష్టపోయాయి. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు సురక్షి తంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఒక్కసారిగా ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబం ఆందోళనకు గురైంది.విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కాశ అంజలి గంగాధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బిజెపి ఆధ్వర్యంలో సమావేశం

ధర్మపురి,ప్రభాతవార్త

బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ ఐ ఆర్ సదస్సుకు సంబంధించి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న ఎస్ ఐ ఆర్ సవరణ కార్యక్రమంలో ఓటు హక్కు ఉన్న వాళ్ళందరూ పాల్గొని,తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గాజు భాస్కర్, పుదరి పవన్, కుమ్మరి తిరుపతి, మండలోజు సూరజ్, సంధవేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పూసల సంఘం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల పట్టణ దేవి శ్రీ గార్డెన్స్ లో జగిత్యాల జిల్లా పూసల సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా పూసల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి వార్త

బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శికి ఘన సన్మానం

గొల్లపల్లి, ప్రభాతవార్త :



గొల్లపల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో గత ఏడు సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన గ్రామ కార్యదర్శి శ్రీవాణికి గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు.గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించి బదిలీ కావడంతో గ్రామ సర్పంచ్ రాజు పోచవ్వ ఆధ్వర్యంలో శ్రీవాణిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజు పోచవ్వ మాట్లాడుతూ, శ్రీవాణి గత ఏడు సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కరోనా సమయంలో గ్రామంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకున్న చర్యలు, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించడం, ఆత్మకూర్ గ్రామాన్ని మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయడం ఆమె సేవల్లో ముఖ్యమైనవని ప్రశంసించారు.కార్యదర్శి శ్రీవాణి మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఇన్నాళ్లు సహకరించిన ప్రజాప్రతినిధులు, గ్రామ సిబ్బంది, గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుచ్చవ్వ లింగయ్య, వార్డు సభ్యులు మానాల ప్రసాద్, ఇంజపూరి మహేష్, వరద సుస్మిత మహేష్, ఆశా వర్కర్లు సుధా, జమున, అంగన్వాడీ టీచర్ సుశీల, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, ఉపాధి మేట్స్, గ్రామ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

ధర్మపురి,ప్రభాతవార్త:



ధర్మపురి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన గుల్లకోట ప్రణీత్ ఆర్మీకి ఎంపికైన సందర్భంగా గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి సదరు యువకుడిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు కష్టపడి చదివి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆర్మీకి ఎంపికైన ప్రణీత్ దేశానికి సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దీపిక, గ్రామానికి చెందిన నాయకులు బడ్డేటి శంకర్,రాజన్న,సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో భక్తుల రద్దీ

- స్వామివారిని దర్శించుకున్న 50వేల మంది భక్తులు

వేములవాడ, ప్రభాతవార్త:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగియనుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. వాటర్ షవర్ల కింద పుణ్య స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకొని క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. దాదాపు 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రమాదాలకు నిలయంగా కోల్ కారిడార్ రోడ్డు

- ఇరువైపులా ముళ్లపొదలు..
- గుంతలమయంగా మారిన రహదారి
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు.. కార్మికులు

రామగిరి ప్రభాతవార్త:





అర్ జీ3 డివిజన్ సెంటినరీ కాలనీ కార్మిక క్షేత్రం నుంచి గోదావరిఖని వరకు ఉన్న కోల్ కారిడార్ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో పాటు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండగా, రోడ్డు దుస్థితి కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్న ఘటనలు పెరిగాయి. రాత్రి సమయంలో సరైన వెలుతురు లేకపోవడం, గుంతలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని పేర్కొన్నారు.రోడ్డు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు వాహనదారుల దృష్టికి ఆటంకంగా మారడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మికులు తెలిపారు. ముఖ్యంగా భారీ బొగ్గు రవాణా వాహనాలు ఈ మార్గంలో అధికంగా సంచరిస్తుండటంతో చిన్న వాహనాల ప్రయాణం ప్రాణాపాయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ రోడ్డుపై చాలా ప్రమాదాలు జరిగి తీవ్ర గాయాలపాలు కాగా, ప్రమాదంలో మరికొంత మంది చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.ఏళ్ల తరబడి ఈ రహదారి మరమ్మతులకు నోచుకోలేదని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు ముళ్లపొదలను తొలగించి వాహనదారులకు సురక్షిత ప్రయాణం కల్పించాలని స్థానికులు, కార్మికులు కోరుతున్నారు.వెంటనే చర్యలు తీసుకోవాలికోల్ కారిడార్ రోడ్డు పరిస్థితిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గుంతలను పూడ్చడం, రహదారిని పునర్నిర్మించడం, ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యల ద్వారా ప్రాణనష్టాన్ని నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువుల మట్టి అక్రమ రవాణాపై విమర్శలు

- కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న కాంట్రాక్టర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

మంథని రూరల్ ప్రభాతవార్త:





పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు కొనసాగుతున్నప్పటికీ చెరువుల నుంచి తరలిస్తున్న మట్టి అక్రమ రవాణాపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అయ్యగారి చెరువు, రావుల చెరువు, కన్నాల చెరువు ప్రాంతాల నుంచి మట్టి అధిక లోడుతో తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా కలెక్టర్ చెరువుల మట్టిని కేవలం రైతుల వ్యవసాయ భూముల అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలని ఆదేశించినప్పటికీ వాటిని కొందరు కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతుల పేరుతో చెరువుల నుంచి భారీగా మట్టిని తరలించి ప్రైవేట్ నిర్మాణాలు, రోడ్డు పనులు, ఇటుక బట్టీలు, కాంట్రాక్ట్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మంథని పరిసర ప్రాంతాల్లో చెరువుల మట్టి అక్రమ రవాణాపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రస్తుతం కూడా అనుమతులు లేని ప్రాంతాలకు మట్టిని తరలించడం, రాత్రి వేళల్లో అధిక లోడుతో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా రవాణా కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు.అనుమతుల్లో పేర్కొన్న సమయాలను అతిక్రమించి, సరైన రసీదులు, రికార్డులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కొందరు వ్యక్తులు తమ సొంత స్థలాల్లో భారీగా మట్టిని డంప్ చేసి నిల్వ చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ఇటుక బట్టీలకు పరిమిత అనుమతులు మాత్రమే జారీ చేసినప్పటికీ, ఆ అనుమతులను అడ్డంగా పెట్టుకొని మరికొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువుల సహజ స్వరూపం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ఉన్న అధికారుల పర్యవేక్షణ లోపించిందని ప్రజలు అంటున్నారు.ఈ నేపథ్యంలో అయ్యగారి చెరువు, రావుల చెరువు తదితర ప్రాంతాల్లో జరిగిన మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులకు మించి మట్టి తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మట్టి డంపులను గుర్తించి,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల శాఖలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చెరువుల నుంచి జరుగుతున్న అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిది గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్





మంథని ప్రాంతంలోని చెరువుల నుంచి జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై సంబంధిత శాఖలు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిది గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మంథని పట్టణంలోని అయ్యగారి చెరువు, రావుల చెరువు, అలాగే మండలంలోని ఇతర చెరువుల నుంచి మట్టి తరలింపులో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చెరువుల పునరుద్ధరణ పేరుతో తవ్విన మట్టిని రైతుల వ్యవసాయ భూములకు మాత్రమే తరలించాలనే నిబంధన ఉన్నప్పటికీ, కొందరు కాంట్రాక్టర్లు మధ్యవర్తులు దానిని ప్రైవేట్ నిర్మాణాలు, ఇటుక బట్టీలు, రోడ్ల పనులు, ఇతర కాంట్రాక్ట్ పనులకు వినియోగిస్తున్నారని విమర్శించారు.జిల్లా కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ వాటిని కొందరు బేఖాతరు చేస్తున్నారని అన్నారు. అనుమతుల్లో పేర్కొన్న సమయాలకు మించి రాత్రి వేళల్లో కూడా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అధిక లోడుతో మట్టిని తరలిస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడంతో పాటు చెరువుల సహజ స్వరూపం దెబ్బతింటోందని పేర్కొన్నారు.అక్రమ మట్టి రవాణాపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని డంప్ చేస్తున్న ప్రాంతాలను గుర్తించి, అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు.రెవెన్యూ, మైనింగ్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ మట్టి రవాణాను పూర్తిగా అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అనుమతులను ఉల్లంఘించిన కాంట్రాక్టర్లు, వాహన యజమానులు మరియు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల ఆస్తిగా ఉన్న చెరువులను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని బూడిది గణేష్, గొర్రెంకల సురేష్ హెచ్చరించారు.

కానరాని అమ్మబాట.. అంగన్వాడి బాట

- పట్టించుకోని పర్యవేక్షణ అధికారులు
- విద్యార్థులు లేక వెలవెలబోతున్న పాఠశాలలు

మంథని ప్రభాతవార్త :





అంగన్వాడీ పాఠశాలల పునర్ వైభవం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నాను ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో స్థానికంగా విఫలమవుతున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నుండి అమ్మబాట అంగన్వాడి బాట అనే కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అంగన్వాడీ సెంటర్ ఇన్చార్జిలతో పాటు పట్టించుకోవాల్సిన పర్యవేక్షణ అధికారులు నామ మాత్రమే నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. మంథని మండలంలోని అంగన్వాడి పాఠశాలల్లో ప్రభుత్వం అనేక రకాల వసతులను కల్పించినను విద్యార్థుల సంఖ్య పెంచడంలో మాత్రం టీచర్లు, సూపర్వైజర్లు విఫలమవుతున్నారు. అమ్మ బాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడంలో సూపర్వైజర్లు పూర్తిగా నిరక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాల నుండి సూపర్వైజర్లు రావడంతో వారు సక్రమంగా అంగన్వాడి పాఠశాలలను పర్యవేక్షణ చేయలేకపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల పలు అంగన్వాడి పాఠశాలలో కుళ్ళి పోయిన కోడిగుడ్లు కాలం చెల్లిన పాలు డబ్బాలు బయటపడిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మంథని పట్టణంలోనే అంగన్వాడి పాఠశాలలు సరైన పద్ధతిలో లేవని దీనిపైన స్థానిక పర్యవేక్షణ అధికారితో పాటు ఉన్న అధికారుల సైతం పట్టించుకోవడంలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇక మంథని మండల పరిధిలోని అంగన్వాడి పాఠశాల పరిస్థితి అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి . పర్యవేక్షణ అధికారి నెలలో ఒక రోజు కూడా అంగన్వాడి పాఠశాలను సందర్శించడం లేదని పర్యవేక్షణ అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపక పోవడంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటంతో పాటు అంగన్వాడి వర్కర్లు విధులను సైతం సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. జూన్ 1 నుండి 15 వరకు అమ్మబాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా చాలా పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని గాలికి వదిలేశారు. ప్రతిరోజు పాఠశాల నిర్వహణపైన పర్యవేక్షణ చేయాల్సిన సూపర్వైజర్లు సైతం నిరక్ష్యంగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేర డం లేదు. పలు అంగన్వాడి పాఠశాలలో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కన్నా రిజిస్టర్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో లాగా కాకుండా ఈ విద్య సంవత్సరంలో నైనా అంగన్వాడి పాఠశాలల నిర్వహణలో అధికారులు సరైన శ్రద్ధ వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహించే సూపర్వైజర్లపై చర్య తీసుకుంటాం

-సిడిపిఓ పుష్పలత

మంథని పట్టణంతో పాటు మండలంలోని అంగన్వాడి పాఠశాలల నిర్వాహణలో నిర్లక్ష్యం వహించే సూపర్వైజర్లతో పాటు అంగన్వాడీ టీచర్ల పైన చర్యలు తీసుకుంటామని సిడిపిఓ పుష్పలత తెలిపారు. అంగన్వాడి పాఠశాలల నిర్వహణ పైన ప్రభాతవార్త తో మాట్లాడారు. జూన్ 1 నుండి 15 వరకు ప్రతి అంగన్వాడి పాఠశాలలో అమ్మబాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలి అన్నారు. ఈ నిర్వహణ బాధ్యత ఆయా సూపర్వైజర్ల పైన ఉంటుందని తెలిపారు. ప్రతి సూపర్వైజర్ వారి పరిధిలోని పాఠశాల లను వారంలో ఒకరోజు తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చూడాలని విద్యార్థుల సంఖ్య, పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను సరిచూసుకోవాలని తెలిపారు. పాఠశాలకు వచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ జరుగుతుందా లేదా అనే విషయాన్ని సైతం సూపర్వైజర్లు పరిశీలించాలని అన్నారు. ప్రస్తుతం అంగన్వాడి పాఠశాలల పైన గ్రామ సర్పంచులు సైతం తనిఖీ చేసే అధికారం ఉందని ఆమె తెలిపారు. గ్రామ స్థాయిలో సర్పంచులు, పట్టణ స్థాయిలో కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ తనిఖీ చేసే అధికారం ఉందన్నారు.